నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
ఆదివారం | జూన్ 23, 2024 | www.navatelangana.com

రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

నవతెలంగాణ-బోథ్

తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో శనివారం బోథ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. బోథ్ మండలంలోని అభివృద్ధి పనులు, సమస్యలపై విన్నవించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ కుంరం కోటేశ్వర్, పిఎసిఎస్ డైరెక్టర్ గొర్ల రాజు యాదవ్ పాల్గొన్నారు.



ఎంపికైన వారికి పోల్ క్లైంబింగ్ పరీక్షలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రెండు సంవత్సరాల క్రితం జూనియర్ లైన్‌మెన్ కోసం నిర్వహించిన అర్హత పరీక్షలో ఎంపికైన వారికి దశల వారీగా పోల్ క్లైంబింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. శనివారం పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో పరీక్షలు నిర్వహించారు. పది మంది అభ్యర్థుల్లో ఒకరు చనిపోగా తొమ్మిది మంది వచ్చారు. వీరికి పోల్ ఎక్కించి వారి నైపుణ్యాన్ని పరిక్షించారు. పోల్ క్లైంబింగ్ పరీక్షకు తొమ్మిది మంది హాజరు కాగా ఐదుగురు ఎంపికైనట్లు ఎస్ఈ జేఆర్ చౌహన్ తెలిపారు. గతంలో కూడా జూనియర్ లైన్ మెన్‌ల భర్తీ కోసం పోల్ క్లైంబింగ్ పరీక్షలు జరిగాయన్నారు. ఇక్కడ ఎంపికైన ఐదుగురులో నిర్మల్‌కు ఇద్దరు, మంచిర్యాలకు ఇద్దరు, ఆదిలాబాద్‌కు ఒకరిని కేటాయించడం జరుగుతుందన్నారు. ఎలాంటి అవకతవకలకు అస్కారం లేకుండా వీడియో ద్వారా పోల్ క్లైంబింగ్ పరీక్ష జరిగిందని పేర్కొన్నారు.

రుణమాఫీ..అన్నదాత హ్యాపీ..!

- ఏకకాలంలో రూ.2లక్షలు మాఫీకి కసరత్తు
- ఐదేండ్ల కాలంలో రుణాలు తీసుకున్న వారికి వర్తింపు
- మార్గదర్శకాలు విడుదల చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం
- ఉమ్మడి జిల్లాలో 3.90లక్షల మందికి రూ.2215కోట్లు మాఫీ
- ప్రభుత్వ నిర్ణయంతో హర్షం వ్యక్తం చేస్తున్న కర్షకులు

ప్రతి ఏటా పంట కోసం చేసిన అప్పుల బాధలతో సతమతమయ్యే అన్నదాతలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న పంట రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ మధ్యలో బ్యాంకుల నుంచి పొందిన రైతులకు సంబంధించి రూ.2లక్షలను మాఫీ చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వం ఐదేండ్ల కాల వ్యవధిని పరిగణనలోకి తీసుకోవడంతో ఉమ్మడి జిల్లాలో లక్షలాది మంది రైతులకు ప్రయోజనం కలగనుంది. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో ఈ కాల వ్యవధిలో తీసుకున్న రూ.2215 కోట్లు మాఫీ కానుండగా.. ఈ లెక్కన సుమారు 3.90లక్షల మంది రైతులకు ప్రయోజనం చేకూరనుంది. రూ.2లక్షల రుణం ఏకకాలంలో మాఫీ చేస్తామని చెప్పడంతో అప్పులు చెల్లించలేక సతమతమవుతున్న అన్నదాతలకు ప్రభుత్వం ఊరట కల్పించడంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడంతో ఆ పార్టీ శ్రేణులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.



వడ్డీ చెల్లిస్తూ రెనివల్ చేసుకున్నా : రాదారపు అనిల్, రైతు, తాంసి



గ్రామంలో మూడెకరాల భూమి ఉంది. తాంసి బ్యాంకులో రూ.1.50లక్షల పంట రుణం తీసుకున్నాను. గత ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని హామీనిచ్చినా చేయలేకపోయింది. దీంతో ప్రతి ఏటా వడ్డీ చెల్లిస్తూ రెనివల్ చేసుకున్నాను. ప్రస్తుత ప్రభుత్వం ఏకకాలంలో రూ.2లక్షల రుణాలు మాఫీ చేస్తామని చెప్పడంతో చాలా సంతోషంగా ఉంది. ఈ సాయంతో వ్యవసాయన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు అవకాశం ఉంటుంది.

చాలా సంతోషంగా ఉంది : పుల్కర్ శేషారావు, టాక్లీ, బేల మండలం



పంట కోసం బ్యాంకు నుంచి రూ.2లక్షలు రుణం తీసుకున్నాను. గత ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేస్తుందని భావించినా కాలేదు. ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రూ.2లక్షలు రుణమాఫీ చేయడం చాలా సంతోషంగా అనిపిస్తోంది. ప్రభుత్వ నిర్ణయం అనేక మంది రైతులకు మేలు జరుగుతుంది.

ప్రభుత్వ నిర్ణయం సంతోషాన్నిచ్చింది : మేకర్తి మాధవ్, రైతు, బూరుగూడ



ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయడం సంతోషంగా ఉంది. నాకు ఉన్న భూమికి సంబంధించిన రూ.1.10లక్షల రుణం తీసుకున్నాను. మూడేండ్ల నుంచి వడ్డీ చెల్లిస్తూ రెనివల్ చేసుకుంటూ వస్తున్నాను. ప్రస్తుత సంవత్సరం వర్షబావ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం ఊరట ఇచ్చింది.

రైతులకు రుణమాఫీ వరం లాంటిది : ఉగేందర్, రైతు



ప్రభుత్వ నిర్ణయం రైతులకు వరం లాంటిది. ప్రభుత్వం చెప్పిన రుణమాఫీ కోసం ఆతృతగా ఎదురు చూస్తున్నాము. 2019లో రూ.లక్ష రుణం తీసుకొని ప్రతి సంవత్సరం రెనివల్ చేసుకుంటున్నాను. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం ప్రతి రైతుకు మేలు చేసేదిగా ఉంది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆసిఫాబాద్

బ్యాంకు రుణాలు చెల్లించలేక అప్పుల బాధలతో సతమతమవుతున్న అన్నదాతలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షల రుణాలు మాఫీ చేస్తున్నామని ప్రకటించింది. 2018 నుంచి 2023 మధ్యలో బ్యాంకుల రుణాలు తీసుకున్న రైతులకు సంబంధించి రుణాన్ని ఏకకాలంలో మాఫీ చేస్తామని చెప్పడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ ప్రకటించినా సకాలంలో చేయలేకపోయింది. రూ.25వేల చొప్పున విడతల వారీగా మాఫీ చేస్తూ పోయింది. ఆ ప్రభుత్వం పడిపోయే చివరి నాటికి అనేక మంది రైతులకు రూ.లక్ష రుణమాఫీ కాలేదు. ఇదే అంశాన్ని ప్రధానంగా తీసుకున్న కాంగ్రెస్ తనకు అనుకూలంగా మార్చుకుంది. ఎన్నికల మేనిఫెస్టోలో రూ.2లక్షల రుణమాఫీ అంశాన్ని చేర్చింది. ఎన్నికల సమయంలో ఈ రుణమాఫీపై విస్తృత ప్రచారం చేయడం.. గతంలో అధికారంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీయే మాఫీ చేసిందనే విషయాన్ని ప్రస్తావిస్తూ రైతుల నమ్మకాన్ని చూరగొన్నది. అనుకున్నట్లుగానే రైతులు కాంగ్రెస్‌ను ఆదరించడంతో రాష్ట్రంలో అధికారంలోకి రాగలిగింది. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15తేదీలోపు రుణమాఫీ పూర్తిచేస్తామని పదేపదే చెబుతూ వస్తోంది. ఇదే అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య మాటల యుద్ధం కూడా కొనసాగింది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం మాఫీకి సంబంధించి కసరత్తు ప్రారంభించడంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది.

సిద్ధమవుతున్న మార్గదర్శకాలు..!

ప్రభుత్వం రైతుల రుణాలు మాఫీ చేసేందుకు ఐదేండ్ల కాల వ్యవధిని పరిగణనలోకి తీసుకోవడంతో అనేక మంది చిన్న సన్నకారు రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఐదు నుంచి పది ఎకరాల వరకు ఉన్న రైతులు ఎక్కువ మంది రూ.2లక్షల వరకు రుణాలు తీసుకోగా.. రూ.50వేల నుంచి రూ.2లక్షల లోపు రుణాలు తీసుకున్న వారు అనేక మంది ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో రూ.2లక్షల వరకు రుణాలు తీసుకున్న వారు సుమారు 3.90లక్షల మంది ఉండగా.. వీరికి రూ.2215 కోట్లు మాఫీ కానున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో 1.17లక్షల మంది రైతులకు సుమారు రూ.730కోట్లు, మంచిర్యాల జిల్లాలో 94వేలమంది రైతులకు రూ.504.22కోట్లు, నిర్మల్ జిల్లాలో 1.17లక్షల మంది రైతులకు రూ.652.39కోట్లు, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 62వేల మంది రైతులకు రూ.329.84కోట్లు మాఫీ కానున్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను ప్రభుత్వం ఒకటి, రెండు రోజుల్లో విడుదల చేయనుందని అధికారులు చెబుతున్నారు.

రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర రైతాంగానికి ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తానని చెప్పడంతో శనివారం స్థానిక అమరవాది గ్రామంలో రైతులు, కాంగ్రెస్ నాయకులు సీఎం, ఎమ్మెల్యే వివేక్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి చెప్పిన వాగ్దానానికి కట్టుబడి ఆగస్టులో రుణమాఫీ చేస్తామని చెప్పిన విధంగా జీవో జారీ చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు పల్లె రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోపతి రాజయ్య, మాజీ ఎంపీటీసీ కళ్యాణ్, వేణు, యువజన కాంగ్రెస్ నాయకులు వెంకటరమణారెడ్డి, మహేందర్, శాంతరంగం, లాడెన్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేకుంటే చర్యలు : ట్రాఫిక్ సీఐ



నవతెలంగాణ-మంచిర్యాల

ఫిట్నెస్ లేకుండా నడిచే బస్సులపై చర్యలు తప్పవని మంచిర్యాల ట్రాఫిక్ సిఐ నరేష్ కుమార్ తెలిపారు. శనివారం మంచిర్యాల పట్టణంలో గల కార్మెల్ హైస్కూల్‌లో బస్ డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేసి బస్సుల తనిఖీ చేపట్టారు. రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాసులు ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహిస్తున్నామని, స్కూల్ బస్‌లను తప్పనిసరిగా కండిషన్‌లో ఉంచుకోవాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన, నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడిపితే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పిల్లలను తీసుకెళ్లే వెహికిల్స్‌ను తప్పనిసరిగా కండిషన్‌లో ఉంచుకోవాలని, ఫిట్నెస్, ఇన్సూరెన్స్, పర్మిట్, డ్రైవింగ్ లైసెన్స్, ఫైర్ సేఫ్టి కిట్, ఫస్ట్ ఎయిడ్ కిట్ తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, స్కూలు బస్సులు నడిపే డ్రైవర్ తప్పకుండా యూనిఫామ్ వేసుకోవాలని తెలపారు. ఇన్సూరెన్స్, పర్మిట్, అటెండర్ లేని బస్సులపై కేసులు నమోదు చేస్తామన్నారు. అనుమతులు, పత్రాలు లేకుండా, పరిమితికి మించి విద్యార్థులను బస్‌లో ఎక్కించుకున్నా, నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నడిపితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ



నవతెలంగాణ-మంచిర్యాల

మమత తరంగిణి సభ్యులు శనివారం పట్టణంలో గల వృద్ధుల ఆశ్రమానికి పండ్లు, ట్యూబ్ లైట్లు, సీలింగ్ ఫ్యాన్లు అందించారు. గోదావరి రోడ్‌లో గల కృప వృద్ధుల ఆశ్రమంలో ఉండే వృద్ధులు, వికలాంగుల భవనంలో అవసరమని తెలుసుకొని విద్యుత్ బల్బులు, సీలింగ్ ఫ్యాన్‌లు అందించినట్లు సంస్థ అధ్యక్షురాలు రాచకొండ మంజుల కృష్ణారావు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు జ్యోత్స్న, చంద్రదత్, పద్మ, నాగమణి, లత పాల్గొన్నారు.

ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా అజయ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రాష్ట్ర బీజేపి ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధిగా పట్టణానికి చెందిన తోట అజయ్‌కుమార్ నియమితులయ్యారు. ఆయనకు ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, బీజేపి జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానందం అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా అజయ్ మాట్లాడుతూ ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధిగా నియమించినందుకు బీజేపి రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తను వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో కలహాల సెగ

- కారణమైన ఎంపీ ఎన్నికల ఫలితం

నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

ఖానాపూర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో కలహాల నిప్పు రాజుకుంటోంది. పార్లమెంట్ ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి ఆశించిన స్థాయిలో ఆధిక్యం రాకపోవడంతో ప్రధాన నాయకులు ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల కంటే పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లు తక్కువగా రావడం ఆ పార్టీ నాయకుల్లో మనస్పర్ధలకు కారణమైనట్లు చెబుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తన ఓటమికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేలే కారకుడైనట్లు పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆత్రం సుగుణ ఆరోపిస్తుండడం స్థానికంగా చర్చానీయాంశమవుతోంది. కేవలం ఖానాపూర్‌లో తగ్గిన 13వేల ఓట్లతోనే ఆత్రం సుగుణ ఓడిపోయి ఉంటే ఆమె ఆరోపణలకు బలం చేకూరేది. కాని జిల్లాలోని నిర్మల్ నియోజకవర్గంలో సుమారు 43500, అలాగే ముధోల్‌లో 56900 కాంగ్రెస్ పార్టీకి బీజేపీ కంటే తక్కువ ఓట్లు వచ్చిన విషయం తెలిసిందే. ఖానాపూర్ కంటే మూడింతల ఓట్లు తక్కువగా వచ్చిన ఇతర నియోజకవర్గాలను పరిగణలోకి తీసుకోకుండా స్థానికంగా తగ్గిన 13000 ఆధిక్యాన్ని మాత్రమే ఓటమికి కారణంగా చెబుతూ ఆత్రం సుగుణ విమర్శలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇదే అదునుగా ఎన్నికలకు ముందు ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన పలువురు నాయకులు తమ ఆధిపత్యం కోసం గ్రూపులు కడుతూ ఇబ్బందికర వాతావరణం సృష్టిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆత్రం సుగుణ మధ్య నెలకొన్న విభేదాలు పార్టీలో గ్రూపులకు మరింత ఆజ్యం పోసేదిగా మారింది. గెలుపోటముల కారణాలు ఏవైనా అనాలోచిత విమర్శలతో ఆత్రం సుగుణ తనకు తానుగా రాజకీయ భవితవ్యాన్ని ప్రశ్నార్థకం చేసుకుంటున్నారని విశ్లేషకులు అంటున్నారు. రాష్ట్ర పరిధిలో జరిగే అసెంబ్లీ ఎన్నికలు, కేంద్ర స్థాయిలో జరిగే పార్లమెంట్ ఎన్నికల తీరుకు ఎంతో తేడా ఉంటుందని, ఆర్థిక వనరులు, ప్రచారశైలి తదితర అంశాలన్నీ అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేస్తాయి. ఇవేమీ తెలుసుకోలేని స్థితిలో విమర్శలు చేసుకోవడం సదరు నాయకులకే నష్టమని, అధికారం చేపట్టిన ఆరు నెలల కాలంలోనే ఎమ్మెల్యే వ్యవహార శైలిని తప్పుబట్టడం, అభ్యర్థి ఓటమికి ఆయనను కారణంగా చూపడం సమంజసం కాదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

మహిళా శక్తి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా అమలు చేసి లక్ష్యాన్ని సాధించేందుకు వీలుగా సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులకు తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న నిర్మాణ పనులు, మహిళా శక్తి కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి లక్ష్యంతో వచ్చే ఐదేళ్లలో మహిళలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం మహిళా శక్తి ద్వారా 15 రకాల కార్యక్రమాలు చేపడుతోందన్నారు. అందులో భాగంగా పాఠశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుట్టుపనిని వారికే అప్పగించిందని మహిళా శక్తి కింద మైక్రో ఎంట్రప్రెన్యూర్స్, కుట్టు కేంద్రాలు, పాడి పశువులు, బ్యాక్ యార్డ్ పౌల్ట్రీ, పౌల్ట్రీ మథర్ యూనిట్స్, సంచార మత్స్య విక్రయ ఔట్‌లెట్లు, మిల్క్ పార్లర్స్, మీసేవ, ఈవెంట్ మేనేజ్మెంట్, మహిళా క్యాంటీన్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్, ఫుడ్ ప్రాసెస్సింగ్ యూనిట్స్, కస్టం హైరింగ్ కేంద్రాలు వంటి 15 రకాల కార్యకలాపాలు చేపట్టడానికి మండలాల వారీగా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ కార్యాచరణ ప్రకారం వివిధ మండలాల్లో గల మహిళా సమాఖ్యలోని స్వయం సహాయక సంఘాల ద్వారా వివిధ యూనిట్లు నెలకొల్పడమే లక్ష్యంగా ఇప్పటి నుండే కార్యాచరణకు శ్రీకారం చుట్టాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేస్తున్న శిక్షణ తరగతులకు ఔత్సాహికులైన క్రియాశీలక మహిళా సంఘాల సభ్యులను ఎంపిక చేయాలన్నారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా చేపడుతున్న నిర్మాణ పనులపై ఆరా తీసి ఈ నెల 30 లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించి, ప్రత్యేక దృష్టి సారించి నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. మండలాల వారీగా పురోగతిని అడిగి తెలుసుకుని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సమావేశంలో డీఆర్డీఓ సాయన్న, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

వివిధ సంఘాలకు ఎస్జీటీ ఉపాధ్యాయుల రాజీనామా



నవతెలంగాణ - కాసిపేట

మండలంలో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులు శనివారం మూకుమ్మడిగా తమ ఉపాధ్యాయ సంఘాల పదవులకు, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. శనివారం మండల ఉపాధ్యాయులు సమావేశం ఏర్పాటు చేసి పదోన్నతులతో జరుగుతున్న తీవ్ర అన్యాయానికి, వివిధ సంఘాలు ఎస్జీటీలను ద్వితీయశ్రేణి ఉపాధ్యాయులుగా భావిస్తూ చూపుతున్న వివక్షను ఖండిస్తూ అధిక సంఖ్యలో ఉన్న ఎస్జీటీలు మూకుమ్మడిగా తాము పని చేస్తున్న వివిధ సంఘాల్లోని పదవులకు, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ప్రతి అంశంలో ఎస్జీటీలపై తీవ్ర వివక్షకు, అణిచివేతకు గురవుతున్నందున పీఆర్టీయూ, టీఎస్‌యూటీఎఫ్, టీపీయూఎస్, టీయూటీఎఫ్, డీటీఎఫ్, టీజీయూఎస్ తదితర సంఘాలకు రాజీనామా చేసి ఎస్జీటీల న్యాయమైన హక్కుల కోసం సమిష్టిగా కృషి చేస్తామని ఎస్జీటీ జేఏసీ నాయకులు పేర్కొన్నారు. ఎస్ఏ తెలుగు, హిందీ, పీడీ ప్రమోషన్లలో కామన్ సీనియారిటీని పాటించాలని, 10వేల పీజీహెచ్ఎం పోస్టులు మంజూరు చేసి పదోన్నతులు కల్పించాలని, ఎఫ్ఎల్ఎన్ రద్దు చేయాలని, ఎస్జీటీలకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని, పీఆర్సీలో ఎస్ఏకు ఎస్జీటీల మధ్య భారీ వ్యత్యాసాన్ని తగ్గించాలని, జీవో 317 ద్వారా స్థానికత కోల్పోయిన ఎస్జీటీలకు న్యాయం చేయాలని, 12 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన ఎస్జీటీలకు ఎస్ఏ హోదా కల్పించాలని, 24 ఏళ్ల సర్వీసు పూర్తి చేడిన ఎస్జీటీలకు జీహెచ్ఎం హోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్జీటీ జేఏసీ నాయకులు వేల్పుల కిరణ్‌కుమార్, జంగపల్లి సురేష్, శారద, రాధిక, అర్పిత, ప్రకాష్, సతీష్, రాజయ్య సుచరిత, వరలక్ష్మి పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో 6,8,9,10 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆఫ్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య పేర్కొన్నారు. ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించి అడ్మిషన్ ఇవ్వడం జరుగుతుందని, మండల విద్యార్థిని, విద్యార్థులు తెలంగాణ మోడల్ స్కూల్ ఆఫ్లైన్ ద్వారా జూన్ 25లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్-నిర్మల్

గిరిజన సంక్షేమ శాఖలో బదిలీలు చేపట్టాలి

నవతెలంగాణ-ఉట్నూర్



టీపీటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు గిరిజన సంక్షేమ శాఖలో బదిలీలు, ప్రమోషన్‌లు లేక షెడ్యూల్ రాకపోవడంతో మూడు దశల పోరాట కార్యక్రమంలో భాగంగా శనివారం కేబీ కాంప్లెక్స్‌లో సర్వీస్ వెరిఫికేషన్‌కి వచ్చిన ఉపాధ్యాయులు నిరసనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లాల నలుమూలల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు, నాయకులు టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగరావు, జిల్లా ఉపాధ్యక్షులు మడవి దన్ను, ఆడే సంతోష్, కనక అభిమాన్, మూగ శ్రీనివాస్, చెట్లపల్లి సంతోష్, రమేష్, సురేందర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను సన్మానించిన ఎన్‌సీసీ సభ్యులు

నవతెలంగాణ-నేరడిగొండ



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ను శనివారం ఎన్‌సీసీ సభ్యులు సన్మానించారు. ఇటీవల నిర్వహించిన ఎన్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంటుకు సహకరించారు. బహుమతులకు ఆర్థిక సాయం అందించారు. కాని బహుమతుల ప్రదానం రోజు ఎమ్మెల్యే లేకపోవడంతో శనివారం ఎన్‌సీసీ సభ్యులు సన్మానించారు. ప్రతి క్రీడలో వెన్నంటి తమను ప్రోత్సహించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యేను సన్మానించిన వారిలో జాదవ్ పవన్ కుమార్, లకాన్ సింగ్, యోగేశ్వర్, దినేష్, పాండు, యశ్వంత్, రవి, అక్షయ్, రమేష్ ఉన్నారు.

గంజాయి సాగు చేసినా విక్రయించినా నేరమే..!



నవతెలంగాణ-తాంసి

గంజాయి సాగు చేసినా విక్రయించినా వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని జైనథ్ సీఐ సాయినాథ్ అన్నారు. శనివారం భీంపూర్ మండలంలోని బెల్సార్ రాంపూర్ గ్రామంలో మాదకద్రవ్యాల నివారణ కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లాలో పూర్తిస్థాయి గంజాయి నిర్మూలనే ధ్యేయంగా, ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణ గంజాయి సాగు చేయడం, వినియోగించడం, విక్రయించడం, రవాణా చేయడం వంటివి చేయవద్దని గంజాయి వల్ల కలిగే అనర్థాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించి, గంజాయి సాగు చేస్తే ఎలాంటి చట్టపరమైన చర్యలు వుంటాయో వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మాదకద్రవ్యాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అమాయక గిరిజనులకు మాయ మాటలు చెప్పి డబ్బు ఆశచూపి గంజాయి సాగు చేయాలని ఎవరైనా మీకు చెప్పినట్లయితే మా పోలీస్ సిబ్బందికి తెలియజేస్తే మీ పేర్లు బయటకు రాకుండా చూసి, అలాంటి వారిపై చర్యలు తీసుకోవడం, నిఘా పెట్టడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భీంపూర్ ఎస్సై ఎండీ ఖలిమ్, పోలీస్ సిబ్బంది గ్రామ మాజీ సర్పంచులు, గ్రామస్తులు, యువత పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీ సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇందిరమ్మ కాలనీ సమస్యలు పరిష్కరించాలని శనివారం ఎమ్మెల్యే పాయల శంకర్‌ను, మున్సిపల్ కమిషనర్‌ను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేసి విన్నవించారు. ఇందిరమ్మ కాలనీ సమీపంలోని గోవధశాలతో తీవ్ర ఎదుర్కొంటున్నామని, గోవధశాలను వెంటనే తొలగించాలని కోరారు. అదే విధంగా కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని, డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని అన్నారు. ఇందులో కాలనీ వాసులు దయాకర్, ప్రణయ్‌చారి, త్రియంబక్, ఎర్రన్న, రాందాస్, అన్వర్ ఖాన్ ఉన్నారు.

పోడు భూముల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-బోథ్

పోడు భూముల సమస్యలను పరిష్కరించాలని, కోరుతూ శనివారం ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణను ఆమె నివాసం ఉట్నూర్‌లో బోథ్ మండలం కౌటా(బి) గ్రామానికి చెందిన పోడుభూమి రైతులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పోడు భూములకు పట్టాలు ఇప్పించాలని కోరారు. అలాగే అటవీశాఖ అధికారులతో ఇబ్బందిగా ఉందని అన్నారు. ఆమె స్పందిస్తూ డీఎఫ్ఓతో మాట్లాడి పోడు భూముల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మెన్ గాజుల సురేందర్, ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షుడు సున్నపు శ్రీనివాస్, నాయకులు సింగారపు రాష్ట్రపాల్, పాలెపు గణేష్ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ కార్యవర్గానికి సన్మానం



నవతెలంగాణ-నేరడిగొండ

ఇటీవల ఎన్నికైన ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని శనివారం లంబాడిల ఐక్యవేదిక ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు మహేందర్ జాదవ్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లైవ్ బోథ్ ఇన్‌చార్జీ పాండు, లైవ్ మండల నాయకులు, కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు దుస్థితి ఇలా.. నడిచేది ఎలా..?

- వర్షానికి బురదమయంగా మారిన రోడ్లు



నవతెలంగాణ-తాంసి

భీంపూర్ మండలంలోని గొల్లఘట్ గ్రామానికి వెళ్లే రహదారి పూర్తిగా బురదమయం కావడంతో ఆ గ్రామానికి రాకపోకలకు సాగించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో రోడ్డు దుస్థితి బాగాలేదని చాలా ఇబ్బందులకు గురవుతున్నామని ఎన్నిసార్లు ఎవరికి చెప్పిన పట్టించుకోకపోవడంతో ఎన్నికలను బహిష్కరిస్తున్నట్టు గ్రామస్తులు తీర్మానించుకున్నారు. పోలింగ్ సమయంలో తహసీల్దార్ భీంపూర్, సీఐ, ఎస్సై, ఆ గ్రామానికి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఆ తరువాత గ్రామస్తులందరూ గ్రామంలో ఉన్న సమస్యలతో పాటు రోడ్డు సౌకర్యం పూర్తి చేస్తేనే ఓటు హక్కును వినియోగించుకుంటామని చెప్పడంతో సంబంధిత అధికారులు ఏమి చేయలేక వెనుదిరిగి వెళ్లి పోయారు. గ్రామస్తులు మాత్రం ఎన్నికలను బహిష్కరించారు. ఎన్నికలైన తర్వాత బోథ్ నియోజకవర్గం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆ గ్రామానికి వచ్చి పార్లమెంట్ ఎన్నికల సమయంలో గ్రామస్తులతో మాట్లాడిన గ్రామ సమస్యలతో పాటు రోడ్డు పనులను త్వరలో ప్రారంభిస్తామని మాట ఇవ్వడంతో పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కును ఆ గ్రామస్తులందరూ వినియోగించుకున్నారు. కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదని, వర్షం పడిందంటే ఆ రోడ్డు పరిస్థితి వర్ణనాతీతంగా ఉంటుందని వాపోయారు. ఏ పనికైనా జిల్లా కేంద్రానికి వెళ్లాలన్న పాఠశాలకు వచ్చే ఉపాధ్యాయులు కూడా ఐదు కిలోమీటర్లు నడిచి వెళ్లక తప్పదని అంటున్నారు. రోడ్డు దుస్థితి ఎప్పుడు బాగుపడుతుందో, ఎప్పుడు తమ బాధలు తీరుతాయెనని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

- సమస్యలు పరిష్కరించడంలో అధికారులు చొరవ చూపాలి
- సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్



నవతెలంగాణ-నార్నూర్

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ కనక మోతుబాయి అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ హాజరయ్యారు. సమావేశంలో వ్యవసాయం, పోడు భూముల సమస్య, విద్య, వైద్యం, విద్యుత్, రోడ్లు, మిషన్ భగీరథ నీరు, అమ్మఆదర్శ పాఠశాల కమిటీ నిర్వహణ పనులు, అంగన్‌వాడీ నిర్వహణ తదితర అంశాలపై సంబంధిత శాఖల అధికారులు ప్రగతి నివేదికను చదివి వినిపించారు. మండల కేంద్రంలో భగీరథ నీరు రావడం లేదని నీటి సమస్య తీవ్రంగా ఉందని, కోఆప్షన్ సభ్యులు దస్తగిరి సభ దృష్టికి తీసుకొచ్చారు. తాడిహత్నూర్ గ్రామంలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాలతో పాటు వివిధ గ్రామాల్లోని పాఠశాల పనుల్లో నాణ్యత పాటించకుండా ఇష్టం వచ్చినట్టు అమ్మ ఆదర్శ పాఠశాల పనులు నిర్వహిస్తున్నట్టు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో పోషకులకు చైర్మెన్ ఇవ్వకుండా వీఓలకు పనులు ఎలా ఇస్తారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వేరే కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించి, నాణ్యతతో పనులు చేయించాలని డీఈ శ్రీనివాస్, ఏఈ సునీల్‌ను ఆదేశించారు. మల్లంగి గ్రామంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఏఈ శ్రీనివాస్‌కు సూచించారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరైన బీటీ రోడ్లను కల్వర్టును వెంటనే నిర్మించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. తరతరాలుగా భూమి కాస్తూ చేస్తున్న గిరిజనులు గిరిజనేతరుల రైతులను ఫారెస్ట్ అధికారులు ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. అనంతరం జెడ్పీ చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ మాట్లాడుతూ అధికారులు ప్రజల దగ్గరుండి వారి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు. మంచి సేవలు అందిస్తే మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. ప్రతి కార్యాలయాల్లో సంభందిత అదికారులు సమయపాలన పాటించాలని కోరారు. సమయ పాలన పాటించే విధంగా చూడటానికి కమిటీని ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ జవహర్‌లాల్‌ను ఆదేశించారు. ముందుగా ఎంపీటీసీలు, జెడ్పీ చైర్మెన్‌కు జన్మదిన శుభ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపి కేక్ కట్ చేసి తినిపించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ జాదవ్, పీఏసీఎస్ ఇన్‌ఛార్జి చైర్మెన్ సురేష్ ఆడే, ఎంపీటీసీలు కళావతి ఉత్తం, పరమేశ్వర్, రేణుకా, అబేదా ఖానం, ఎత్మబాయి, పంచపూల, తహసీల్దార్ రాజ లింగం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కిరణ్, పీఆర్ ఏఈ లింగన్న, డాక్టర్ రాంబాబు, సీడీపీఓ శారద, ఏంఈఓ ఆశన్న, ఏపీఓ సురేష్ జాదవ్, ఏఓ రమేష్, ఏపీఎం రమేష్, సూపరింటెండెంట్ గంగాసింగ్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో శనివారం కళ్యాణ లక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సేవలు ప్రతి ఒక్కరికి అందాలని కల్యాణలక్ష్మి, షాదీముబారక్ అనేవి పేదింటి బిడ్డకు ఒక వరమనే అన్నారు. మొట్టమొదటిగా తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే ఎక్కడ లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ అందించారని చెప్పుకొచ్చారు. అంతేకాకుండా ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అనిల్ జాదవ్ స్థానిక ప్రదేశంలో ఉండడని పలు ఆరోపణలు వినిపిస్తున్నాయని, అటువంటి సందేహాలు ఏమి పెట్టుకోవద్దని నేరడిగొండ మండల కేంద్రంలోనే ఉంటానని అన్నారు. నియోజకవర్గంలోని ఎవరికి సమస్య వచ్చినా మీకు అందుబాటులోనే ఉంటానని గెలిచిన తర్వాత ఆదిలాబాద్‌కు హైదరాబాద్‌లోనూ ఉంటానని ఇలా ఎవరు ఎన్ని చెప్పినా నమ్మొద్దని అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి, ప్రజాసేవకై ఉంటానని, ప్రతి ఒక్కరి సమస్యను పరిష్కరించడానికి పాటు పడుతానని అన్నారు. కల్యాణ లక్ష్మి చెక్కులతో పాటు ఒక తులం బంగారం కూడా రావాల్సి ఉండేది, కానీ ఇంకా తులం బంగారం అమలులోకి రాలేదని, కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అతి దగ్గరలోనే తులం బంగారం కూడా కళ్యాణలక్ష్మితో పాటు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మెన్, రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్, వడూర్ ఎంపీటీసీ పండరి, మాజీ పీఏసీఎస్ చైర్మెన్ నానాక్ సింగ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-తాంసి

భీంపూర్, తాంసి, మండలాలకు చెందిన పలువురు బాధిత కుటుంబాలను శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో పాటు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి జోగు రామన్న బాధిత కుటుంబాలను పరామర్శించారు. తాంసి మండలంలోని సవర్గాం గ్రామ మాజీ సర్పంచ్ మునేశ్వర్ భరత్ తండ్రి, భీంపూర్ మండల కేంద్రానికి చెందిన కారోబారి తారాచంద్ భార్య, అర్లి(టి) గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గొల్లి రామయ్య, గత కొన్ని రోజుల కింద అనారోగ్య కారణాలతో మృతి చెందిన విషయం తెలుసుకొని బాధిత కుటుంబాలను పరామర్శించి, ఓదార్చారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించాలని వేడుకొన్నారు. వారి వెంట జెడ్పీటీసీ సుధాకర్, తాంసి, భీంపూర్ మండలాల బీఆర్ఎస్ నాయకులు నాగయ్య, సంతోష్, వినోద్‌రెడ్డి, కృష్ణ, సంజీవరెడ్డి, గంగయ్య, అఫ్రోజ్, అనిల్, లస్మన్న, రఘు, వెంకట్ రెడ్డి ఉన్నారు.

రేపు చలో ఉట్నూర్ ఐటీడీఏ

- తుడుందెబ్బ పిలుపు



నవతెలంగాణ-నార్నూర్

ఆదివాసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 24న ఉట్నూర్ ఐటీడీఏలో నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు కనక ప్రభాకర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో కుమురంభీం విగ్రహం వద్ద ఆదివాసీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్ ప్రాంతంలో మెగా స్పెషల్ డీఎస్సీ వేయాలని, ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న ఐటీడీఏలో బ్యాగ్‌లాక్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. జీఓ నెంబర్ 3ను యథావిధంగా కొనసాగించాలని, జీఓనెంబర్-3 ప్రకారం ఉద్యోగస్తులకు పదోన్నతులు బదిలీలు కల్పించాలన్నారు. పోడు భూములు సాగు చేస్తున్న పోడు రైతులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించేందుకు ఆదివాసీ 9 తెగల నాయకులు, ప్రజలు, ఉద్యోగస్తులు, సంఘాల నాయకులు, విద్యార్థులు, నిరుద్యోగ యువతీ, యువకులు, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక, మేధావులు, కవులు, కళకారులు ప్రతి ఒక్కరు మహా ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.వారి వెంట ఆదివాసీ నాయకులు ఉన్నారు.

చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అడవుల సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని యుగతులసి పార్టీ నాయకులు సురేష్ అన్నారు. ఇటీవల దుర్గానగర్ ప్రాంతంలో చెట్లను నరికిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదిలాబాద్ ఫారెస్ట్ కార్యాలయంలో సీసీఎఫ్ శర్వానంద్, డీఎస్ఓ బాజీరావు పాటిల్‌లకు శనివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెట్లను నరికిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని అటవీ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ఖైదీలకు న్యాయ సాయం అందిస్తాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జైలులో శిక్ష అనుభవిస్తున్న, రిమాండ్‌లో ఉన్న మహిళ ఖైదీలకు న్యాయ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని న్యాయ సహాయ మండలి న్యాయవాదులు దాసరి గంగారాం, అరుగుల అశోక్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా జైలులో మహిళ ఖైదీలకు ఈ విషయంపై అవగాహన కల్పించారు. జైలులో ఉన్న వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు ఎలాంటి న్యాయ సహాయం అందిస్తారో వివరించారు. వారి వెంట జైలర్ పన్నాల సూర్యప్రకాష్ రెడ్డి ఉన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ పరీక్షల కొరకు హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల తెలంగాణ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని సునీత కుమారి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు జులై 10 లోపు టీఎస్‌స్టడీసర్కిల్.కో.ఇన్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జులై 21న నిర్వహించనున్న ప్రవేశ పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు. ఎంపికైన వారికి 10 నెలల పాటు ఉచిత భోజన వసతితో కోచింగ్ ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు ఈ 9494149416 నెంబరును సంప్రదించాలని కోరారు.

దొరికిన పర్సు అందజేత



నవతెలంగాణ-ఉట్నూర్

ఇంద్రవెల్లి గ్రామానికి చెందిన మడావి లక్ష్మి సంజీవ్ దంపతులు శుక్రవారం అర్ధరాత్రి హైదరాబాద్ నుంచి ఉట్నూర్‌కు వస్తున్న క్రమంలో శనివారం ఉదయం బస్సులో పర్సు మర్చిపోయారు. బస్సులో దొరికిన పర్సును డ్రైవర్ వినోద్ ఉట్నూర్ డిపోలో అందజేశారు. ఒక తులం పూసల తాడు ఉంది. రూ.75వేల విలువ గల బంగారం, పర్సును వారికి అందజేశారు. అందజేసిన వారిలో డీఎం కల్పన, వీఆర్ కృష్ణ, ఎస్ఎం, వీబీరావు, సెక్రటరీ ఉన్నారు.

నవతెలంగాణ
కుమురంభీం ఆసిఫాబాద్
ఆదివారం | జూన్ 23, 2024 | www.navatelangana.com

అర్ధరాత్రి బ్యాంకులో సైరన్

నవతెలంగాణ-పెంచికల్‌పేట్



మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో శనివారం తెల్లవారుజామున 3గంటల సమయంలో ఎమర్జెన్సీ సైరన్ మోగడంతో కలకలం సృష్టించింది. శబ్దం విన్న స్థానిక కాలనీవాసులు డయల్ 100కు ఫోన్ చేసి తెలపడంతో హుటాహుటిన పెంచికలపేట ఎస్సై కొమురయ్య, పోలీసు సిబ్బందితో కలిసి బ్యాంకు వద్దకు చేరుకున్నారు. బ్యాంకు మేనేజర్‌కు ఫోన్ చేసి పిలిపించారు. బ్యాంకును ఓపెన్ చేసి దొంగతనం ఏమైనా జరిగిందా, ఎవరైనా లోపల ఉన్నారో మొత్తం వెతికి చూశారు. స్ట్రాంగ్ రూమును కూడా పూర్తిగా చెక్ చేశారు. ఎవరూ లేకపోవడంతో సైరన్ ఎలా మోగిందో బ్యాంకు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

సీసీ రోడ్డుకు భూమి పూజ

నవతెలంగాణ-రెబ్బెన



మండలంలోని తుండగ గ్రామంలో బుడగ గూడెంలో రూ.ఐదు లక్షల ఎంఎస్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎంపీపీ జుమ్మిడి సౌందర్య ఆనంద్ భూమి పూజ చేశారు. శనివారం గ్రామంలో పర్యటించి అభివృద్ధి పనులకు పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక గ్రామాలు పల్లెలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మీ సహకారంతో మండలంలో మరిన్నీ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో నాయకులు ధర్మయ్య, హరీష్, జీవన్, కిషోర్, వాసుదేవ్, మహేందర్ పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

- జిల్లా మైనింగ్ అధికారి గంగాధర్
- ఇసుక లారీ పట్టివేత



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా మైనింగ్ అధికారి గంగాధర్ హెచ్చరించారు. జిల్లాలోని రెబ్బెన నుండి హైదరాబాద్ అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని శనివారం పట్టుకున్నారు. పట్టుకున్న లారీకి రూ.74వేలు అపరాధ రుసుము వేధించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అక్రమ మైనింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా కాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇసుక, మట్టి అక్రమంగా రవాణా జరిగినట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌లో ర్యాంకు సాధించిన విద్యార్థికి సన్మానం



నవతెలంగాణ-వాంకిడి

జేఈఈ ర్యాంకు సాధించిన దుర్గం అర్జున్‌ను కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కష్టపడి చదివితే ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారని అభిప్రాయపడ్డారు. ఆర్థికంగా వెనుకబడిన అర్జున్‌కు పై చదువుల నిమిత్తం కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. విద్యార్థులు కష్టపడి ఉన్నతస్థాయికి రావాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థిని సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, అధ్యాపకుల బృందం పాల్గొన్నారు.

సర్కారు బడులను సద్వినియోగం చేసుకోవాలి



నవతెలంగాణ- ఆసిఫాబాద్

విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ మల్లికార్జున్ అన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని బాబాపూర్, రౌటసంకెపల్లి ప్రభుత్వ పాఠశాలలలో శనివారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మధ్యాహ్న భోజనం, ఉచితంగా పుస్తకాలు, దుస్తులను కూడా అందించడం జరుగుతుందన్నారు. బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సత్రవేణి సావిత్రి మల్లేష్, ఎంఈఓ మనుకుమార్, సత్రవేణి రాజన్న, కిషన్, పోల్కర్ బీజ్జు, కిరణ్, మల్లికార్జున్, సురేందర్, మాజీ ఉప సర్పంచ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాన్ని తెలుగు, ఇంగ్లీష్‌లో ఇవ్వాలి

నవతెలంగాణ-రెబ్బెన

ఈనెల 30న సింగరేణిలో నిర్వహించే ఆపీ ఆపరేటర్స్ పరీక్షల్లో ప్రశ్నపత్రాలను తెలుగు ఇంగ్లీష్‌లో ఇవ్వాలని హెచ్ఎంఎస్ వైస్ ప్రెసిడెంట్ పి.రాజబాబు అన్నారు. సింగరేణిలో ఇంగ్లీష్ మీడియం చదివిన వారు ఉన్నారు వారికి తెలుగు పట్ల పూర్తి అవగాహన లేకపోవడంతో వల్ల పరీక్షలు బాగా రాయలేక పోతున్నారన్నారు. గతంలో కూడా పరీక్షలు నిర్వహించినప్పుడు ఇంగ్లీష్ మీడియం చదివినవారు డ్రైవింగ్ టెస్టులో పాసై కూడా రాత పరీక్షలులో తెలుగు ప్రశ్న పత్రాన్ని సకాలంలో అర్థం చేసుకోలేకపోవడం వల్ల అర్హత సాధించలేకపోయారని తెలిపారు. యజమాన్యం స్పందించి తెలుగుతో పాటుగా ఇంగ్లీషులో ప్రశ్నపత్రాన్ని ముద్రించి ఇవ్వాలని కోరారు.

ఉచిత కోచింగ్‌కు దరఖాస్తులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖకు చెందిన రాష్ట్ర స్టడీ సర్కిల్ లో సివిల్స్ ప్రిలిమినరీ, మెయిన్స్ ఉచిత కోచింగ్ కోసం అర్హులైన అభ్యర్థులనుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి సజీవన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ (బీసీ-ఈ)తో పాటు దివ్యాంగులైన అభ్యర్థులు వచ్చే నెల 10తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తు చేసుకున్న వారిలో 100 మంది ఎంపిక కోసం జూలై 21న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు 10 నెలల పాటు ఉచిత కోచింగ్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు టీఎస్‌స్టడీ సర్కిల్.కాం.ఇన్ వెబ్ సైట్ సంప్రదించాలని పేర్కొన్నారు.

మానకొండురులో అదృశ్యం..దహెగాంలో మృతదేహం

- మహిళతో సాన్నిహిత్యమే హత్యకు కారణం
- మిస్టరీ ఛేదించిన మానకొండూరు పోలీసులు



ఘటన స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు.. ఇన్‌సెట్‌లో మృతుడు సాయికిరణ్(ఫైల్)

నవతెలంగాణ-దహెగాం

పరాయి మహిళతో సాన్నిహిత్యం కారణంగా ప్రాణాలు పోతున్నా సమాజంలో మార్పు రావడం లేదు.కరీంనగర్ జిల్లా మానకొండురుకు చెందిన యువకుడు భార్యాపిల్లలు ఉండగా పని చేసే చోట మరో మహిళతో ఏర్పడ్డ సాన్నిహిత్యం వల్ల ప్రాణాలు కోల్పోయాడు. మండలంలోని (పాత ఊరిలో)పాడుబడ్డ బావిలో కుళ్లిన శవమై బయటపడ్డ విషాద ఘటన శనివారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. మానకొండూరు సిఐ రాజ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మానకొండూరు గ్రామం కు చెందిన అనంతోజు సాయికిరణ్ (29) ఏప్రిల్18న రోజున తన ఇంటి వద్ద తన భార్య అయిన అనూషతో సిద్దిపేట వెళ్లొస్తాను అని చెప్పి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో చుట్టుపక్కల గ్రామాల్లో వెతికిన ఆచూకీ లభించక పోవడంతో గత మే నెల 2 న మానకొండూరు పోలీస్ స్టేషన్లో తన భర్త కనిపించడం లేదని అనుషా ఫిర్యాదు చేసింది. దీంతో మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేయడం ప్రారంభించారు. ఇదే క్రమంలో గత నాలుగు సంవత్సరాల క్రితం సాయికిరణ్ తన కుటుంబ సభ్యులతో సిద్దిపేట జిల్లా మీరుదొడ్డి మండలం కొండాపూర్ గ్రామంలో విజయ దుర్గ పౌల్ట్రీ ఫామ్ లో పనిచేస్తుండగా ఆసిఫాబాద్ జిల్లా దహెగాంకు చెందిన బట్టే సునీత ఈమె భర్త శ్రీనివాస్ కూడా అదే పౌల్ట్రీ ఫామ్‌లో పనిచేస్తుండగా సునీతకు సాయి కిరణ్‌కు మధ్య సాన్నిహిత్యం ఏర్పడింది. ఈ విషయంలో గొడవలు జరుగగా సాయికిరణ్ తన భార్యతో సహ తన సొంతూరు మానకొండూరు వచ్చి కర్ర మెషిన్‌లో పనిచేస్తున్నాడు. కానీ సాయి కిరణ్ సదరు మహిళను కలవాలనే ఉద్దేశంతో ఏప్రిల్ 18 రోజున సాయికిరణ్ పౌల్ట్రీ ఫాం దగ్గరికి వెళ్లగా ఆమె భర్త చూసి సునీతతో గొడవ పడ్డాడు. దీంతో భార్యాభర్తలిద్దరు దహెగాంకు తిరిగి వచ్చారన్నారు. దీంతో విషయం తెలుసుకున్న సాయి కిరణ్ కూడా సునీత కోసం ఏప్రిల్ 19 న దహెగాం కు వచ్చాడు. దీంతో ఇదే అదునుగా భావించిన సునీత భర్త శ్రీనివాస్, సునీత తండ్రి, ఆమె మేనమామతో కలిసి కర్రలతో కొట్టి చంపి గ్రామ చివర ఉన్న పాడుబడ్డ బావిలో పడేసినట్లు పేర్కొన్నారు. దీంతో బావిలో కుళ్లిన శవాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పదలో వ్యక్తి మృతి



నవతెలంగాణ-సిర్పూర్(టి)

భూపాలపల్లి జిల్లాకు చెందిన కొడిపె వెంకటేష్ వయస్సు(34) యువకుడు తలకు తీవ్ర గాయాలై మృతి చెందినట్లు ఎస్సై దీకొండ రమేష్ తెలిపారు. పోలీసులు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం జయశంకర్ భూపాలపల్లి చెందిన కొడిపే ఐదు సంవత్సరాల నుండి మహారాష్ట్రలోని శిరోంచ మండలం కోట పోచపల్లి గ్రామాల్లో తన అత్తగారి ఇంటి వద్ద భార్య పిల్లలతో కలిసి కార్పెంటర్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోశించుకుంటున్నాడు. ఈనెల 20న టేకు కర్ర కొనుగోలు చేయడానికి వెన్నంపల్లి సంతోష్ కుమార్ వాహనాన్ని అద్దెకి తీసుకొని డ్రైవర్ జేక మహేష్‌తో కలిసి మహారాష్ట్రలోని నాగపూర్‌కు వెళ్లి కర్ర కొనుగోలు చేసుకుని 21న రాత్రి బయలుదేరారు. శనివారం ఉదయం డ్రైవర్‌కు నిద్ర రావడంతో రైస్ మిల్లు దగ్గర గల రోడ్డు ప్రక్కన వాహనం ఆపాడు. వెంకటేష్‌కు స్థలం సరిపోకపోవడంతో వాహనం వెనకాల పడుకుంటానని వెళ్లాడు. పెట్రోలింగ్ నిర్వహించే పోలీస్ సిబ్బంది ఉదయం 5 గంటల ప్రాంతంలో వాహనం వెనుకల ఉన్న వ్యక్తిని గమనించగా రక్తపు మడుగులో ఉండాన్ని చూసి మరణించినట్లు ధృవీకరించి మృతుని అన్న మల్లేష్‌కు సమాచారం ఇచ్చారు. మృతుని కుడి నుదుటి, కుడి చెంప, కుడి కాలు మడమ దగ్గర ఎడమ మోకాళ్ళపై రాకుడు గాయాలతో పాటు ముక్కులో నుంచి రక్త రావడంపై పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తునట్లు ఆయన తెలిపారు.

మాదకద్రవ్యాల రహిత సమాజం నిర్మించాలి

- సీనియర్ సివిల్ జడ్జి యువరాజ

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి యువరాజ

మాదకద్రవ్యాలు లేని సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి యువరాజ అన్నారు. ఈనెల 26న నిర్వహించనున్న మాదకద్రవ్యాల నివారణ దినోత్సవంలో భాగంగా వారం రోజులపాటు నిర్వహించే వివిధ రకాల కార్యక్రమాల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, బెండర ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మాదకద్రవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాల వల్ల శరీరం కృషించిపోతుందన్నారు. వీటి వాడకం వల్ల సమాజంలో రోజురోజుకు నేరప్రవృత్తి పెరుగుతుందన్నారు. విద్యార్థి దశ నుండే ఇటువంటి వాటిపై అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే నివారణ సాధ్యమవుతుందన్నారు. మాదకద్రవ్యాలను విద్యార్థులు దూరంగా ఉంచడమే కాకుండా వారి చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు కూడా వాటికి దూరంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో లీగల్ కౌన్సిలర్ అంజనీ దేవి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కనకయ్య, వాంకిడి ఎస్ఐ సాగర్, సాంఘిక సంక్షేమ గురుకుల ప్రిన్సిపాల్ శ్రీనాథ్, అడ్వకేట్లు వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

సత్ప్రవర్తనతో నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలి

సత్ప్రవర్తనతో నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి యువరాజ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రత్యేక సబ్ జైల్‌లో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సుకు జైల్ సూపరింటెండెంట్ ప్రేమ్ కుమార్‌తో కలిసి హాజరై ఖైదీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖైదీలు నేర ప్రవృత్తిని వీడి సత్ప్రవర్తనతో ప్రశాంతమైన జీవనం గడపాలన్నారు. తెలిసో తెలియకో క్షణికావేశంలో తప్పులు చేసి జైలులో ఉన్నవారు న్యాయవాదిని నియమించుకునే స్తోమత లేనివారు న్యాయ సేవాధికార సంస్థ నుండి ఉచిత న్యాయ సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. ప్రతిరోజు ధ్యానం చేస్తూ సత్ప్రవర్తనతో దైవం పట్ల భక్తి భావం కలిగి ఉండాలన్నారు. ఖైదీల ఆరోగ్య పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించి సేవలు అందించాలని తెలిపారు. బ్రహ్మకుమారి ఆర్తి ఖైదీలకు రాజయోగ మెడిటేషన్‌పై శిక్షణ అందించారు. కార్యక్రమంలో జైలు అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని గోయగావ్ గ్రామ శివారులో మహారాష్ట్ర-తెలంగాణ సరిహద్దు వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలోని లకడ్‌కోట్ గ్రామానికి చెందిన రాంచందర్ ద్విచక్ర వాహనంపై మండలంలోని గోయగావ్ గ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో గోయగావ్ గ్రామ శివారులోని జాతీయ రహదారి వంతెన వద్ద మహారాష్ట్రలోని వణి గ్రామానికి చెందిన కుంబార్‌కార్ రమేష్ కారు అతివేగంగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. దీంతో ద్విచక్ర వాహనంపై ఉన్న రాంచందర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని అంబులెన్స్‌లో రాజూరా ఆస్పత్రికి తరలించారు. రాంచందర్ కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం పైనుండి పడి మృతి

నవతెలంగాణ-రెబ్బెన

మండలంలోని కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్ సమీపంలో ద్విచక్ర వాహనంపై నుండి పడి లక్ష్మెట్టిపేటకు చెందిన ఎస్‌కే జలీల్(41) మృతి చెందాడు. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం లక్ష్మెట్టిపేటకు చెందిన ఎస్‌కే జలీల్ కాగజ్‌నగర్ మండలం పీహెచ్ ఈజ్‌గాం ప్రభుత్వ ఆస్పత్రిలో ఎంఎన్ఓ విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రతిరోజు మాదిరిగానే శుక్రవారం లక్ష్మెట్టిపేటలోని తన ఇంటి నుండి ద్విచక్రవాహనం(టీఎస్ 19జీ3152)పై బయలుదేరాడు. రెబ్బెన మండలం క్రాస్ రోడ్ సమీపంలో వాహనం అదుపుతప్పి పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108 అంబులెన్‌లో కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. జలీల్ కుమారుడు ఎస్‌కే అఖిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. రెబ్బెన సిఐ చిట్టిబాబు సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

జిల్లా అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ పాత్రధారులు కావాలి

- కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



స్వచ్ఛంద సంస్థలు, అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాను అన్ని రంగాలలో ముందు ఉంచడంతో పాటు ప్రజా సంక్షేమం, జిల్లా అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తున్నామని దీనిలో ప్రతి ఒక్కరు పాత్రధారులు కావాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శనివారం జిల్లా శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల పథకంతో మౌలిక వసతులు అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. బడిబాటతో బడి బయట పిల్లలు లేకుండా చూస్తున్నట్లు వివరించారు. క్షేత్రస్థాయిలోకి వైద్య సేవలు అందే విధంగా ఏర్పాట్లు చేశామన్నారు. మారుమూల ప్రాంతాలలో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బందితో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. బాలింతలు, గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించి రక్తహీనతతో బాధపడుతున్న వారికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతిరోజు ఇంటింటి నుండి తడి చెత్త, పొడి చెత్తలను సేకరించి డంపింగ్ యార్డులకు తరలిస్తున్నామన్నారు. గ్రామాలలో క్రీడా రంగాన్ని ప్రోత్సహించే విధంగా క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయడం జరిగిందని, గ్రామపంచాయతీల పరిధిలో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించేందుకు మహిళా సంఘాలను ప్రోత్సహిస్తునే వివిధ రకాల అభివృద్ధి పనులు అప్పగిస్తున్నట్లు తెలిపారు. జోడేఘాట్, మార్లవాయి, చింతల మాదర జలపాతం, గుండాల, మిట్టె జలపాతాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి తుకారాం, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్, జిల్లా విద్యశాఖ అధికారి అశోక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముష్కాన్, బాలి శ్యామ్, కార్తీక్, శ్రీనివాసన్, ఐశ్వర్య, అధికారులు పాల్గొన్నారు.

25న కొబ్బరి సాగుపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

కొబ్బరి సాగుపై ఈనెల 25న జిల్లాలోని పెంచికల్‌పేట మండల కేంద్రంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ఉద్యానవన శాఖ అధికారి సందీప్ కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొబ్బరి సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, పంట సాగుకు రాయితీలు, సాగు విధానాల గురించి సంబంధిత శాస్త్రవేత్తలతో రైతులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పెద్దసంఖ్యలో పాల్గొని కొబ్బరి సాగుపై ఉన్న సందేహాలను నివృత్తి చేసుకుని, మెలకువలు తెలుసుకోవాలన్నారు.

విద్యుత్ స్తంభాన్ని తొలగించాలి

నవతెలంగాణ-కెరమెరి

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించాలని మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు మొహ్మద్ సుజాయిత్ ఖాన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల కేంద్రంలోని సుల్తాన్‌గూడ సమీపంలో ఆసిఫాబాద్ నుండి ఉట్నూర్ కు వెళ్లే ప్రధాన రహదారికి పక్కన 11కేవీ లైన్ విద్యుత్ స్తంభం కుంగి, విరిగి పోయిందని పేర్కొన్నారు. వర్షాకాలం కావడంతో వర్షాల వల్ల విద్యుత్ స్తంభం పడిపోయే అవకాశం ఉందన్నారు. విద్యుత్ స్తంభం విషయంలో విద్యుత్ అధికారులను సంప్రదించిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన 11కేవీ లైన్ స్తంభాన్ని తొలగించి, కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలన్నారు.

ఫీజుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలె సాయిక్రిష్ణ

నవతెలంగాణ-కాగజ్‌నగర్



అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రయివేట్ విద్యాసంస్థలలో ప్రతీ సంవత్సరం విచ్చలవిడిగా ఫీజులు పెంచుతున్నారని, ఫీజులు నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి చాపిలె సాయిక్రిష్ణ కోరారు. శనివారం ఎంఈఓ కార్యాలయంలో సీసీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సాయిక్రిష్ణ మాట్లాడుతూ పుస్తకాలు, స్టేషనరీ, యూనిఫామ్ అమ్మకూడదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, ప్రయివేటు విద్యాసంస్థలు అవేవి పట్టించుకోకుండా స్కూళ్లలోనే నోటు బుక్స్ నుండి పాఠ్యపుస్తకాల వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. మండలంలో రెన్యువల్ చేసుకోని విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయాలన్నారు. కొన్ని పాఠశాలలు కాన్సెప్ట్, ఎక్సలెంట్, టాలెంట్‌ల వంటి తోకలు తగిలించుకొని అడ్మిషన్లు చేసుకుంటున్నారని, విద్యాహక్కు చట్టం ప్రకారం ఇది నిషేధమని ఇలాంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులు కూడా చూసి చూడనట్లు వదిలేస్తున్నారన్నారని, ఎంఈఓ స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వసాకె సాయికుమార్, మండల నాయకులు కొట్రంగి కార్తీక్ పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ పూర్తిస్థాయి కార్యవర్గం ఏర్పాటు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ ప్రింట్ మీడియా ప్రెస్ క్లబ్ పూర్తిస్థాయి కార్యవర్గం శనివారం ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షులుగా అంగల తిరుపతి, ఎండి ఇసాక్, గంధం శ్రీనివాస్, గౌరవ సలహాదారులుగా జంబుల మధూకర్, విడిదినేని శ్రీనివాస్, అధ్యక్షులుగా తాళ్లపల్లి సురేందర్ రావు, ప్రధాన కార్యదర్శిగా ఉప్పుల తిరుమల చారి, కోశాధికారిగా షఫీ ఉల్లా, ఉపాధ్యక్షులుగా అనంతుల సురేష్, దుస్స మహేష్, ఈర్ల సతీష్ కుమార్, జమీల్ అహ్మద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వార్ల మహేష్, జాయింట్ సెక్రటరీగా పుల్లూరి సంతోష్, సభ్యులుగా జుమ్మిడి రాజు, అబ్దుల్ సమీర్, కోడం శ్రీకాంత్, కొమ్ము విశ్వనాథ్, బోగ అనిల్, నల్లాల రాజులను ఎన్నుకున్నారు.



ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల తనిఖీ

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలో ఉన్న ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లను మంచిర్యాల ఫుడ్ ఇన్స్‌పెక్టర్ వాసు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో అధికంగా కలర్లు కలుపుతున్నారని, ఆ కలుషిత ఆహార పదార్థాలు తినేవారికి అనారోగ్యంపాలవుతారన్నారు. అధికంగా కలర్లు కలుపుతున్న పలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికంగా కలర్స్ వాడితే కఠిన చర్యలు తప్పవని యజమానులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఆఫీస్ సబార్డినేటర్ షకీల్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-దండేపల్లి



కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు రుణమాఫీ ప్రకటించిన పట్ల దండెపల్లి మండల రైతులు, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం అన్ని హామీలను నెరవేస్తుందని దీనిలో భాగంగా పంటల రుణమాఫీపై నిర్ణయం తీసుకోవడం చాలా సంతోషకర విషయమని వారు అన్నారు. ఇప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ ఆరు గ్యారెంటీలు అందిస్తాం

● ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్‌రావు



నవతెలంగాణ-మంచిర్యాల

అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు గ్యారెంటీలు అందేలా అమలు చేస్తామని మంచిర్యాల కాంగ్రెస్ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు అన్నారు. శనివారం మంచిర్యాల పట్టణంలోగల మైనారిటీ హాల్‌లో లబ్దిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందించారు. గ్యారంటీలకు దరకాస్తు చేసుకొని వారెవరైనా మల్లి దరకాస్తు చెసుకునే అవకాశం ఉందని, ఉచిత కరెంట్, గ్యాస్ సిలిండర్ సబ్సిడీకి ప్రతి ఒక్కరు దరకాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇచ్చినా ఆరు గ్యారెంటీల్లో కొన్ని అమలు చెశామని, అర్హులైన వారికీ ఉచిత కరెంట్, గ్యాస్ సిలిండర్, ఇండ్లు ఇవ్వడానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని, తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒకరు ఆరు గ్యారెంటీలను వినియోగించుకోవాలని కోరారు. ఇప్పటికి రైతులకు రైతు బంధు, రుణమాఫీలు అమలు చేశామని, ఆరోగ్యశ్రీ సేవలు అవసరమైన వారు తన ఆఫీస్‌కి వచ్చి ముందుగానే సమాచారం ఇవ్వాలని, ఇంకో రెండు సంవత్సరాల్లో హైద్రాబాద్, వరంగల్ లోని కార్పొరేట్ హాస్పిటల్స్ మాదిరి మంచిర్యాలలో ప్రభుత్వ హాస్పిటల్ నిర్మాణం అయిపోయి జిల్లా ప్రజలకు వైద్య సేవలు అందుతాయని తెలిపారు. మంచిర్యాలకు చెందిన 155 మంది లబ్ది దారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందిచారు. కార్యక్రమంలో మంచిర్యాల తహసీల్దార్ రమేష్, మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, కౌన్సిలర్‌లు పుదారి ప్రభాకర్, మహేశ్వరీ, నల్లశంకర్, సుద్దమల్ల హరికృష్ణ పాల్గొన్నారు.

క్యాబినెట్ ఆమోదంతో ప్రతిపక్ష పార్టీల నోటికి తాళం



నవతెలంగాణ-జైపూర్

అమలు కాని హామీలు ఇచ్చి అధికారం చేపట్టారని ఆరోపించిన ప్రతిపక్ష నోరును సీఎం రేవంత్‌రెడ్డి మూయించారని కాంగ్రెస్ నాయకుడు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పంట రుణం రూ.2 లక్షలు మాఫీ ప్రకటించడంతో శనివారం మండల కేంద్రంలో గల కాంగ్రెస్ కార్యాలయం ఆవరణలో పార్టీ అధ్యక్షుడు ఫయాజోద్దీన్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సంధర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఒక్క రుణ మాఫీ మాత్రమే కాదు కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు చేయడం జరుగుతుందని, అసెంబ్లీ ఎన్నికల తర్వాత పార్లమెంట్ ఎన్నికలు రావడంతో పథకాల అమలులో కొంత ఆలస్యం జరిగినప్పటికీ ఎన్నికలు ముగిసినందున ప్రభుత్వం పాలనపై దృష్టి సారించిందని అన్నారు. రానున్న రోజుల్లో వ్యవసాయ రంగాన్ని మరింతగా అభివృద్ధి పరిచే కార్యక్రమాలు చేపట్టడానికి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు జైనోద్దీన్, కాంగ్రెస్ నాయకులు చల్ల సత్యనారాయణరెడ్డి, పాపిరెడ్డి, బేతు తిరుపతిరెడ్డి, విశ్వంబర్‌రెడ్డి, నర్సింగరావు, సంతోషం శేఖర్, గణేష్, సమ్మయ్య, నామాల తిరుపతి, ముదాం రమేష్, జక్కుల వెంకటేశం, అరిగెల శ్రీనివాస్‌గౌడ్, పండుగ రాజన్న, అన్నం వెంకన్న, సంపత్‌రెడ్డి, కటుకూరి సత్యం, సాగర్, సుమన్ పాల్గొన్నారు.

సాదాసీదాగా సామాజిక తనిఖీ

నవతెలంగాణ-జన్నారం

ఉపాధి హామీ పనులపై శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలంలో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదిక సాదాసీదాగా సాగింది. ఈ కార్యక్రమానికి అదనపు డీఆర్‌డీఓ దత్తారాం హాజరై మండలంలోని ఆయా గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనులకు సంబందించిన కర్చులపై తనిఖీ నిర్వహించారు. పనుల్లో జరిగిన తప్పిదాలపై సంబందింత అధికారులకు నోటీసులు జారిచేస్తూ భవిష్యత్తులో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని హెచ్చరించారు. కొన్ని గ్రామాల్లో మాస్టర్లపై సంతకాలు పెట్టి పనికి వెళ్లకుండానే డబ్బులు తీసుకున్నట్లు తనిఖీలో తేలిందన్నారు. వారిపై చర్యలు తీసుకొని తీసుకున్న డబ్బులను రికవరీ చేపిస్తామన్నారు. ఉపాధి హామీ పనులు జరుగుతున్న సమయంలో కూలీలకు నీడ మంచినీటి సౌకర్యం లేదని, గ్రామాలలో తనిఖీ చేసిన అధికారులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. అలాంటి వారిపై కూడా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిసైడింగ్ అధికారి డీఆర్‌డీఓ దత్తారం, ఎంపీడీఓ శశికళ ఎంపీ ఈఓ రమేష్ ఏపీఓ రవీందర్, అసోసియేషన్ విలేజ్ ఆఫీసర్ కిరణ్, సామాజిక తనిఖీ బృదం సభ్యులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకే గ్రామాల్లో 'పోలీస్ నైట్ హాల్ట్'

● దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు

నవతెలంగాణ-కాసిపేట

శాంతిభద్రతల పరిరక్షణకే గ్రామాల్లో పోలీస్ నైట్ హాల్ట్ కార్యక్రమం పెట్టడం జరిగిందని దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. శుక్రవారం రాత్రి కాసిపేట మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సాలేగూడ గ్రామంలో పోలీస్ నైట్ హాల్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆంజనేయులు గ్రామ ప్రజలతో మాట్లాడి వారి సమస్యలని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మీ రక్షణ, భద్రత గురించి ఎల్లప్పుడూ అందుబాటులో చట్టపరిధిలో మీ సమస్యలు పరిష్కరిస్తూ పోలీస్ మీకోసం ఉంటుందనే నమ్మకం, భరోసా కల్పిస్తూ, అసాంఘిక శక్తులను కట్టడి చేయడంతోపాటు శాంతిభద్రతల పరిరక్షణ కోసమే గ్రామాల్లో పోలీస్ నైట్ హాల్ట్ కార్యక్రమాన్ని రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ రూపొందించారని తెలిపారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా మెలగాలన్నారు. ఘర్షణలకు పాల్పడకుండా స్నేహ భావంతో ఉండాలని కోరారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసులను సంప్రదించాలని కోరారు.

వన్యప్రాణుల కోసం పచ్చిక మైదానాల అభివృద్ధి

● అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి



గడ్డి జాతి విత్తనాలు చల్లుతున్న అటవీ సంస్థ అధికారులు

నవతెలంగాణ-జైపూర్

రక్షిత అటవీ ప్రాంతాల్లో వన్య ప్రాణులకు ఆహారంగా పచ్చి బయిళ్ల(మైదానాలు) అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ(టీజీఎఫ్‌డీసీ) డివిజనల్ మేనేజర్ శ్రావణి అన్నారు. ఏరువాక పౌర్ణమి ప్రపంచ రైన్ ఫారెస్ట్ డే సంధర్భంగా శనివారం కోటపల్లి మండలంలో నీలగిరి ప్లాంటేషన్ మధ్య ఖాళీ ప్రదేశాలను గుర్తించి గడ్డి జాతి గింజలు చల్లారు. ప్లాంటేషన్ పరిధిలో ఖాళీ ప్రదేశాల్లో మొదటి సారిగా ఐసోలియా గడ్డి జాతి గింజలు చల్లి పచ్చిక మైదానాలు ఏర్పాటు చేయాలని సంకల్పించినట్లు తెలిపారు. ప్లాంటేషన్లలో పచ్చిక దొరకక జింకలు, కుందేళ్ళు, అడవి గొర్రెలు తదితర వన్యప్రాణులు అంతరిస్తున్నాయని తెలిపారు. అటవీ ప్రాంతంలో ఆహారం దొరకని సమయంలో కొన్ని చోట్ల పంట పొలాల్లో గడ్డి కోసం వెళ్లి రసాయన మందుల పిచికారితో ఉన్న గడ్డిని తిన్నటువంటి వన్యప్రాణులు మృత్యువాతన పడే అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఈ కారణంగా అటవీ ప్రాంతాల్లో, ప్లాంటేషన్లలో సహజ సిద్ధంగా పచ్చిక మైదానాలు పెంచాలని నిర్ణయించి ఈ మేరకు గడ్డి జాతి విత్తనాలు చల్లించామని తెలిపారు. మున్ముందు ఇంకా పెద్ద ఎత్తున పచ్చిక మైదానాలు ఏర్పాటు చేయాలని సంకల్పంతో ఉన్నామని, ఫలితంగా వన్యప్రాణులకు ఆహారం దొరకడంతో పాటు భూగర్భ జలాలు పెరగడం జరుగుతుందని అన్నారు. కాగా కోటపల్లి మండలంలో వన్యప్రాణుల సంఖ్య ఎక్కువగా ఉండి ఆహార కొరతతో బాధపడుతున్నట్లు గుర్తించి ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్ రేంజ్‌ల ప్లాంటేషన్ మేనేజర్లు గొగు సురేష్, లక్ష్మన్, సునిత, డిప్యూటీ ప్లాంటేషన్ మేనేజర్ దుర్గం రాకేష్, నరేష్ ఝాన్సీలక్ష్మి, ఫీల్డ్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

24న అంగన్‌వాడీల ధర్నా విజయవంతం చేయాలి



నవతెలంగాణ-జన్నారం

అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఈనెల 24వ తేదీన కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సీతామహాలక్ష్మి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో మంచిర్యాల జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు రూ.లక్ష, ఆయాలకు రూ.50వేల రిటైర్మెంట్ బెనిఫిట్ చెల్లించాలని గత ప్రభుత్వం ఇచ్చిన జీఓ నెంబర్ 10ని రద్దు చేసి టీచర్లకు రూ.పది లక్షలు, ఆయాలకు రూ.ఐదు లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా టీచర్లకు ఆయాలకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని, 24 రోజుల సమ్మె కాలపు వేతనాన్ని చెల్లించాలని 65 సంవత్సరంల లోపు 30 సంవత్సరాల సర్వీస్ ఉన్నవారికి అనారోగ్య కారణాలతో డ్యూటీ చేయలేము అనేవారికి వాలంటరీ రిటైర్మెంట్ కల్పించి రిటైర్మెంట్ బెనిఫిట్ అమలు చేయాలని అన్నారు. అంగన్వాడీ టీచర్లు ఆయాల ఖాళీలు భర్తీ చేసి కారుణ్య నియామకాలను చేపట్టాలని అవసరమైన వారికి బదిలీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా కార్యదర్శి తోకల సరస్వతి, బి శైలజ, దుర్గం లక్ష్మి, లింగం పద్మ, జాడికృప, కామెర రాజవ్వ, కాల్వ ఏసు మణి పాల్గొన్నారు.

అధికారులు చొరవ తీసుకుని వేతనాలు ఇప్పించాలి



నవతెలంగాణ-నస్పూర్

ఎస్ఆర్పి ఓసిపిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కన్వేయన్స్ డ్రైవర్లకు గత రెండు నెలలుగా(ఏప్రిల్, మే) వేతనాలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు జోక్యం చేసుకొని వేతనాలు ఇప్పించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు దూలం శ్రీనివాస్ అన్నారు. శనివారం శ్రీరాంపూర్ ఓసీపీలోని కాంట్రాక్ట్ కన్వెన్షన్ డ్రైవర్లతో నిర్వహించిన మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. డ్రైవర్లకు వచ్చే వేతనాలు అరకొర వేతనాలని, ఆ వేతనాలు సైతం నెలల తరబడి రాకుంటే ఆ కార్మికుడు, ఆ కార్మికుని కుటుంబం ఎలా బతుకుతుందని అధికారులను ప్రశ్నించారు. సింగరేణి యాజమాన్యం అన్ని విభాగాల కాంట్రాక్టు కార్మికులకు ప్రతి నెల 7వ తేదీన వేతనాలు ఇవ్వాలని సర్క్యులర్ ఇచ్చినప్పటికీ దానిని అమలు చేయడంలో అధికారులు అలసత్వాన్ని ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. 7వ తేదీ వేతనాలు ఇవ్వని కాంట్రాక్టర్లపైన చర్యలు తీసుకోవడంలో ఎందుకు వెనుకడుతున్నారని, కార్మికుల పరిస్థితులను అర్థం చేసుకొని సింగరేణి అధికారులు స్పందించి కన్వేయన్స్ డ్రైవర్లకు రావలసిన రెండు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే ఇప్పించే విధంగా, అదే విధంగా ప్రతి నెల వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్న కాంట్రాక్టర్ల పైన తగిన చర్యలు తీసుకోవాలని సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం సిఐటియుగా డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి వేతనాలు ఇప్పించకుంటే నిరసన కార్యక్రమాలు సైతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సతీష్, రాజేశం, సురేష్, కుమార్, రవిందర్, సాగర్, రవి పాల్గొన్నారు.

హాజరు శాతాన్ని పెంచి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలి



నవతెలంగాణ-నస్పూర్

భూగర్భగనులలో హాజరు శాతాన్ని పెంచి సంస్థ అభివృద్ధికి ప్రతి ఒక్క ఉద్యోగి, అధికారి తోడ్పడాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి అన్నారు. శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫెరెన్స్ హాల్‌లో ఎస్ఆర్పి1,3 గనులలో 2023 కనీసం వంద మస్టర్లు, 2024లో కనీసం 50 మాస్టారులు చేయని గైర్హాజర్ ఉద్యోగులకు ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం మీ అందరి అదృష్టమని మీ తల్లిదండ్రులు ఉద్యోగం చేసిన సమయంలో ఉన్న పరిస్థితులు ప్రస్తుతం లేవని, కావున ప్రతి ఒక్క ఉద్యోగి తమ యొక్క హాజరు శాతాన్ని పెంచుకొని సంస్థ అభివృద్ధిలో పాలు పంచుకోవాలని అన్నారు. సింగరేణి సంస్థ కల్పిస్తున్న సదుపాయాలు మరెక్కడ లేవని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇప్పటి నుంచి అయినా ఉద్యోగులు ప్రతినెల 20 మస్టర్ల చేయాలని సూచించారు. ఈ రోజు కౌన్సిలింగ్ కు 116 మంది గైర్హాజరు ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులతో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, సీఎంఓఏఐ శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షులు కె వెంకటేశ్వర రెడ్డి, డీజీఎం పర్సనల్ పి అరవింద రావు, డీజీఎం ఐఈడి చిరంజీవులు, డీవై .సీఎంఓ డాక్టర్ పి రమేష్ బాబు, డివైపిఎంలు రాజేష్, పాలకుర్తి రాజు, సీనియర్ పిఓ గౌస్ పాషా పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-కాసిపేట



ఆన్ లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని కాసిపేట ఏఎస్ఐ బూర రవీందర్ సూచించారు. శనివారం మండల కేంద్రంలో సైబర్ మోసాలపై చైతన్య పరిచేందుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలు, క్రెడిట్ కార్డ్స్ సంబంధిత మోసాలు, ఇన్వెస్ట్మెంట్ మోసాలు, అడ్వర్టైజ్మెంట్ ఫ్రాడ్స్, లోన్ యాప్‌లు, ఓటీపీ, సైబర్ క్రైమ్ పోర్టల్, సైబర్ టోల్ ఫ్రీ నెంబర్ 1930పై వివరించారు. ఆన్ లైన్ మోసాలపై అడ్డుకట్ట వేసే విధాన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు రాజేందర్, రాజు, రామకష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



నవతెలంగాణ-నస్పూర్

మహిళల చట్టాలు, సైబర్‌నేరాలు, షీ టీమ్ పనితీరుపై శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కెరళ మోడల్ స్కూల్ విద్యార్థులకు రక్షణ, సెన్స్ ఆఫ్ సెక్యూరిటీ, సైబర్ క్రైమ్, డయాల్ 100లపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, వరకట్నం వేదింపులపై అవగాహన కల్పించారు. పిల్లలు, మహిళలను ఇబ్బందులకు గురి చేసేవారిపై చట్టపరంగా కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ప్రజలకు మరింత దగ్గరై సేవలు అందిస్తున్నామని ఏదైనా సమస్య ఉంటే డయల్ 100 కాల్ చేయాలని సూచించారు. కొత్త వారిని గుడ్డిగా నమ్మవద్దని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సామాజిక దురాచారాల నిర్మూలన, గ్రామీణ వాతావరణ విశిష్టత, కుటుంబ అనుబంధాలు, సైబర్ నేరాలపై, సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ డయాల్ 1930పై, అవగాహన కల్పించారు. మహిళల గురించి ప్రత్యేక రక్షణ చర్యలు చేపడుతున్నామని అన్నారు.

బొగ్గు బ్లాక్‌లను నేరుగా సింగరేణికే కేటాయించాలి



నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్రంలో సింగరేణికి కేటాయించాల్సిన బొగ్గు గనులను బహిరంగ వేలం పేరుతో కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని, రాష్ట్రానికి చెందిన జి కిషన్ రెడ్డి గనుల శాఖ పదవి చేపట్టగానే తెలంగాణకు తీరని అన్యాయం చేయబోతున్నారని, దీనిని విరమించుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ అంబటి లక్ష్మణ్, సీనియర్ నాయకులు కూకటికారి బుచ్చయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో పత్రికా విలేకరులతో మాట్లాడుతూ బొగ్గు బ్లాకును వేలం ద్వారా కాకుండా నేరుగా సింగరేణికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఉపయోగపడాల్సిన సహజ వనరులను, కార్పొరేట్ల లాభాల కోసం కట్టబెడుతున్న బీజేపీ ప్రభుత్వ విధానాలు విరమించుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల నాయకులు శేపూర్ లక్ష్మి, వెంకవ్వ పాల్గొన్నారు.

మహిళల భద్రతకు పోలీసుల కృషి

నవతెలంగాణ-తాండూర్



మహిళల భద్రతే లక్ష్యంగా పోలీసు శాఖ కృషి చేస్తుందని తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం పోలీసు ఆధ్వర్యంలో మహిళల భద్రత, సైబర్ క్రైం, ఆన్‌లైన్ మోసాలు తదితర అంశాలపై విద్యార్థినిలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళలపై వేధింపులు జరగకుండా షీ టీమ్‌లు పనిచేస్తున్నాయని తెలిపారు. మహిళలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ కార్యకలాపాలు నెరవేర్చుకునేందుకు షీ టీమ్‌లు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినిలు చదువుపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. ఆడపిల్లల చదువు సమాజాన్ని ముందుకు నడుపుతుందన్నారు. సమాజంలో రోజురోజుకు పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల విద్యార్థులు అవగాహన పెంచుకోవాలన్నారు. మహిళలు, విద్యార్థినులు ఈవ్ టీజింగ్‌కు, వేధింపులకు గురైతే షీ టీమ్‌కు, 100 నెంబర్‌కు వెంటనే ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కేజీబీవీ ప్రత్యేక అధికారి సుమన, ఉపాధ్యాయులు కళావతి, మనీషా సంధ్యారాణి పాల్గొన్నారు.

అందరికీ అందుబాటులోకి ఆరోగ్యశ్రీ

నవతెలంగాణ-నస్పూర్

ఆహార భద్రతా కార్డు(తెల్ల రేషన్ కార్డు) లేని వారికి కూడా ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందరికీ అందేలా చూస్తామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. శనివారం ఎస్సీఓఏ క్లబ్‌లో కల్యాణలక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆరోగ్యశ్రీ అందుబాటులోకి తీసుకురావడమే తన లక్ష్యమని, ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేరుస్తామని తెలిపారు. అలాగే సింగరేణిలో రిటైర్డ్ (రూ.10 వేల లోపు పెన్షన్)కార్మికులకు ఆహార భద్రత కార్డులను అందించి, ప్రభుత్వ పథకాలను అందజేస్తామని అన్నారు. సింగరేణి ఏరియాలో మిగిలిన వారికి తొందర్లోనే పట్టాలను అందిస్తామన్నారు. సింగరేణి అధికారులను సంప్రదించి ఖాళీ ఉన్న క్వార్టర్లను రిటైర్డ్ కార్మికులకు ఇప్పిస్తామన్నారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ సురిమిళ్ళ వేణు, వైస్ చైర్మన్ గెల్లు రజిత, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడా మైదానం ధ్వంసం

నవతెలంగాణ-తాండూర్

మండలంలోని ద్వారకాపూర్, బోయపల్లి గ్రామపంచాయతీలో గల తెలంగాణ క్రీడా మైదానాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. క్రీడా మైదానాలలోని చెట్లను నరికి వేశారు. వస్తువులను ధ్వంసం చేశారు. ఈ విషయంపై పంచాయతీ సెక్రెటరీ సురేష్ కుమార్ శనివారం తాండూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నవతెలంగాణ
ఆదిలాబాద్
ఆదివారం | జూన్ 23, 2024 | www.navatelangana.com

ఎస్ఐగా మోహన్‌రావు బాధ్యతలు

నవతెలంగాణ-లోకేశ్వరం



మండల నూతన ఎస్ఐగా మోహన్‌రావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ దిగంబర్, కానిస్టేబుల్‌లు శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో రాజీలేకుండా పని చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. మట్కా, గుట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణా విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తిలేదన్నారు.

బెల్ట్ షాపులను తొలగించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లాలో బెల్ట్ షాపులను అరికట్టాలని డివైఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి కార్తీక్ డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో 4వ రోజు జిల్లా కేంద్రంలోని పైకాజి నగర్ కంటకాలనీలో తిరుగుతూ సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలోని మురికి కాల్వలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కోరారు. బెల్టు షాపులు విపరీతంగా పెరిగిపోయాయని వాటిని నివారించాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సానిటేషన్ పనులు కాలనీలో చేయాలని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు గెడం టికనంద్, జిల్లా ఉపాధ్యక్షులు దుర్గం నిఖిల్, శ్రావణి పాల్గొన్నారు.

అనుకున్నదే అయింది..
ఐపీ పెట్టిన వ్యాపారి

- 37 మందికి డబ్బులు ఎగనామం పెట్టే ప్రయత్నం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

అనుకున్నదే అయ్యింది. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన ఒక వ్యాపారి రూ.10 కోట్ల వరకు అప్పులు చేసి చేతులు ఎత్తేసినట్లు ఈ నెల 7న తేదీన 'నవతెలంగాణ' దినపత్రికలో వార్త ప్రచురితమైన విషయ తెల్సిందే. ఇపుడు ఆ వ్యాపారి ఐపీ(ఇన్‌సాల్వెన్సీ పిటీషన్) పెట్టి 37 మంది వ్యాపారులకు తాను ఇవ్వాల్సిన డబ్బులకు ఎగనామం పెట్టే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక మార్కెట్ ఏరియాలో ఒక బ్యాంక్‌కు సంబంధించిన సర్వీసు సెంటర్ నడుపుకునే ఈ వ్యాపారి రూ. కోట్లలో అప్పులు చేసి చేతులు ఎత్తేసినట్లు ప్రచారం జోరుగా సాగుతోంది. ఇతనికి అప్పులు ఇచ్చిన వారు కూడా బహిరంగంగా తాము అప్పులు ఇచ్చినట్లు చెప్పుకోలేని పరిస్థితి ఉండడంతో సదరు వ్యాపారికి ఎవరు ఎంత మొత్తంలో ఇచ్చారనేది స్పష్టంగా తెలియలేదు. ఇపుడు ఆ వ్యాపారి కోర్టును ఆశ్రయించి ఐపీ దాఖలు చేశారు. దీంతో అప్పులు ఇచ్చిన వ్యాపారుల పేర్లు బహిర్గతమయ్యాయి. వీరికి త్వరలోనే కోర్టు నుండి నోటీసులు రానున్నట్లు సమాచారం. అప్పులు తీసుకున్న వ్యాపారి ఐపీ దాఖలు చేశాడని కోర్టు ద్వారా వీరికి నోటీసులు అందే అవకాశముంది. కాగా ఐపీ దాఖలు చేసినంత మాత్రాన సదరు వ్యాపారి డబ్బులు ఎగ్గొట్టే అవకాశం కూడా లేదు. కాని అప్పులు ఇచ్చిన వ్యాపారులు ఇపుడు ఏం చేస్తారనే విషయంలో సందిగ్ధత నెలకొంది.

టీజీపీఎస్సీ పరీక్షలపై కలెక్టర్ సమావేశం

- రేపటి నుంచి పరీక్షలు ప్రారంభం
- పకడ్బందీగా నిర్వహించాలి
- కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టీజీపీఎస్సీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, డివిజనల్ అకౌంట్ ఆఫీసర్ పరీక్షలకు సంబంధించి శనివారం జిల్లా కలెక్టర్ రాజర్షిషా తన ఛాంబర్‌లో లైన్ డిపార్ట్‌మెంట్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 24 నుంచి 29 వరకు హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. అలాగే జూన్ 30 నుంచి జులై 4 వరకు డివిజనల్ అకౌంట్ ఆఫీసర్ పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ పరీక్షల కోసం జిల్లా కేంద్రంలోని నలంద కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్ ఫోన్‌లకు అనుమతి లేదని అన్నారు. పోలీసు బందోబస్తుతో పాటు అబ్జర్వర్, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ప్రత్యేకాధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. శాంతి భద్రతల పర్యవేక్షణలో గట్టి నిఘా ఏర్పాటు చేయాలనీ, మహిళా పోలీస్ సిబ్బందిని నియమించాలని తెలిపారు. సకాలంలో అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి చేరుకునేందుకు ప్రత్యేక బస్ సౌకర్యం కల్పించాలని అన్నారు. ఉదయం, సాయంత్రం బస్‌లు నడిచేలా బస్సుల సంఖ్య ఎక్కువగా ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్షా కేంద్రంలో నిరంతరం విద్యుత్ సరఫరా అందించాలని, విద్యుత్ అంతరాయం కలగకుండా అధికారులు తగుచర్యలు చేపట్టాలని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్యసిబ్బంది అవసరమైన మందులతో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఈ సమావేశంలో లైన్ డిపార్ట్‌మెంట్ అధికారులు డీఎస్పీ జీవన్‌రెడ్డి, పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం కలిగి ఉండాలి



నవతెలంగాణ-జైపూర్

జీవితంలో విజయాన్ని సాధించలంటే ఆత్మవిశ్వాసం కలిగిఉండాలని ఎస్సై శ్వేత అన్నారు. రామగుండం పోలీస్ కమీషనర్ శ్రీనివాస్ ఆదేశాల మేరకు శనివారం చెన్నూర్ పట్టణంలో పాఠశాల విద్యార్థులకు ఉమెన్ సేఫ్టీ, ఆత్మవిశ్వాసం, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. పట్టణంలో గల చిన్న మున్సి హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సొంత వ్యక్తిత్వం, లక్ష్యంతో ఏదైనా సాధించగలమన్న నమ్మకం కలిగిఉండాలని తెలిపారు. కష్టపడే తత్వం, ఓడిపోతామనే భయాన్ని వీడి ప్రయత్నంతో విజయం సాధించాలన్నారు. తాత్కాలిక ఆనందం కోసం ప్రలోభాలకు ఆకర్షణలకు గురై భవిష్యత్ జీవితం నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్యార్థులు విద్యార్థి దశ నుండి మంచి లక్ష్యాలు అలవర్చుకొని పట్టుదలతో ముందుకు సాగాలన్నారు. చదువు వలన సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని, ఆన్‌లైన్ మోసాలపై అడ్డుకట్ట వేయడానికి అవగాహన కల్పిస్తామని సూచించారు. విద్యార్థులపై జరుగుతున్న అఘాయిత్యాలు, వేధింపులు ఉమెన్ సెఫ్టీ పోలీస్, షీటీమ్‌పై అవగాహన కల్పించారు.

నకిలీ ధృవపత్రాలను గుర్తించి తొలగించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఉపాధ్యాయ బదిలీలలో తప్పుడు వైద్య ధృవపత్రాలు, ప్రత్యేక కేటగిరి పాయింట్లు, స్పౌస్ కేటగిరి దరఖాస్తులను రివెరిఫికేషన్ చేయాలని తపస్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు సునీల్ చౌహన్, వలబోజు గోపికృష్ణ అన్నారు. శనివారం కలెక్టర్ రాజర్షిషాను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దరఖాస్తులను అన్నింటిని పరిశీలించి, నకిలీ వైద్య ధృవపత్రాలను గుర్తించి జాబితాలో నుంచి తొలగించాలని అన్నారు. తప్పుచేసిన వారిపైన శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పౌస్ కేటగిరీలో కూడా ఐదు ఎనిమిది సంవత్సరాల నిండకుండానే మళ్లీ దరఖాస్తు చేసుకున్న వాటిని గుర్తించి, జాబితా నుంచి తొలగించాలన్నారు. ఉపాధ్యాయుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకుని ఎలాంటి పొరపాట్లు చేసిన వ్యక్తిగత బాధ్యత వహిస్తామని హామీ తీసుకోవాలని కోరారు.

రైతులపై అటవీ అధికారుల దౌర్జన్యం మానుకోవాలి

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు
- కలెక్టరేట్ ఎదుట సంఘం ఆధ్వర్యంలో రైతుల నిరసన
- పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అటవీ అధికారులు వారికి సంబంధం లేకున్నా కూడా వచ్చి రైతులపై దౌర్జన్యం చేస్తు భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, అలాంటి చర్యలను మానుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు అన్నారు. శనివారం బేల మండలం బాది, సిర్సన్న గ్రామాల రైతులతో కలిసి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. అటవీ భూమి కాదని, అది రెవెన్యూ భూమి అన్న పత్రాలను చూపించారు. ఈ సందర్భంగా లంక రాఘవులు మాట్లాడుతూ బేల మండలంలోని బాది, సిర్సన్నలో రైతులు దాదాపు 40 నుంచి 50 సంవత్సరాలుగా రెవెన్యూ భూమిలో సాగు చేస్తున్నారని తెలిపారు. కానీ అటవీ అధికారులు అక్కడ చెట్లు పెట్టాడానికి భూమిని ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ భూమిని ఇప్పటికే బ్యాంకులు కూడా రైతులకు రుణాలు ఇచ్చాయని, అధికారులు పట్టాలు ఇచ్చేందుకు సర్వేలు కూడా చేశారన్నారు. కానీ దౌర్జన్యంగా అటవీ శాఖ అధికారులు, రైతులకు భయభ్రాంతులకు గురి చేస్తు కేసులు పెడుతామని బెదిరించడం సరికాదన్నారు. అధికారులు చర్యలు తీసుకోని రైతులకు న్యాయం చేయాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు ఆశన్న, భీంరావ్, రైతులు పాల్గొన్నారు.

వర్షానికి ఇల్లు కూలి మహిళ మృతి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వర్షం కారణంగా ఓ పాత ఇల్లు కూలి మహిళ మరణించిన ఘటన పట్టణంలోని బ్రాహ్మణవాడలో శుక్రవారం చోటు చేసుకుంది. బ్రాహ్మణవాడలోని పాత ఇంట్లో రామ్ నివాస్ అనే వ్యక్తి తన భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి కురిసిన వర్షానికి ఇల్లు కూలిపోవడంతో అందులో రామ్‌నివాస్ భార్య ఉషా అందులో కురుకుపోయింది. గమనించిన ఇరుగుపోరుగు వారు పోలీసు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది ఉషాను బయటకు తీశారు. అప్పటికే మరణించినట్లు గుర్తించారు.

నోటీసులు అందిన వారు ఇండ్లు ఖాళీ చేయాలి..

వర్షాల వల్ల శిథిలావస్థలో ఉన్న ఇండ్లు కూలిపోయే ప్రమాదం ఉందని, పట్టణంలోని పలు ఇండ్లకు నోటీసులు ఇవ్వడం జరిగిందని మున్సిపల్ కమిషనర్ ఖమార్ అహ్మద్ అన్నారు. నోటీసులు ఇచ్చిన వారు స్పందించని కారణంగా ప్రమాదాల్లో ప్రాణాలు పోయే అవకాశం ఉంటుందన్నారు. శుక్రవారం అర్ధరాత్రి శిథిలావస్థలోని ఇల్లు కూలి మహిళ మరణించడం బాధకరమన్నారు. నోటీసులు వచ్చిన వారు వెంటనే ఇండ్లను ఖాళీ చేయాలని సూచించారు. లేని పక్షంలో జేసీబీతో వాటిని తొలగిస్తామని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ..

పట్టణంలోని బ్రాహ్మణవాడలో శుక్రవారం రాత్రి ఇంటి పైకప్పు కూలి మృతి చెందిన ఉషా పాండే కుటుంబాన్ని శనివారం ఎమ్మెల్యే పాయల్ శంకర్ పరామర్శించారు. అనంతరం ఆయన ప్రమాదం జరిగిన తీరును స్థానికులను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున లభించే ప్రయోజనాలు అందించే ఏర్పాటు చేస్తానని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ పట్టణ అధ్యక్షుడు లాలా మున్న, శ్రీనివాస్ ఉన్నారు.

మున్సిపల్ పరిధిలో పనులు వేగవంతం చేయాలి



నవతెలంగాణ-జైపూర్

చెన్నూర్ పురపాలక సంఘం పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శనివారం చెన్నూర్ మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన కమీషనర్ గంగాధర్‌తో కలిసి కార్యాలయంలో వివిధ విభాగాలతో పాటు ప్రజాపాలన సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను అధికారులు సమన్వయంతో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. వార్డులలో మిషన్ భగీరథ ద్వార శుభ్రమైన తాగు నీటిని అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. అన్ని వార్డులలో వీధి దీపాల నిర్వాహణ పకడ్బందీగా ఉండేలా చూడాలని సూచించారు. వార్డులలో అంతర్గత రహదారులు, మురుగు కాలువలలో పూడిక లేకుండా శుభ్రపర్చాలని, పారిశుధ్య నిర్వాహణలో భాగంగా డ్రై డే కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అవగాహణ కల్పించాలన్నారు. ప్రతి బుధ, శనివారాలలో వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఇమ్యూనైజేషన్‌లో భాగంగా పిల్లలకు అందించే టీకాలపై ఆశా వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించి దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలని, ప్రజాపాలన సేవా కేంద్రానికి వచ్చే దరఖాస్తుదారుల సందేహాలు నివృత్తి చేయాలన్నారు. మున్సిపల్ పరిధిలో నర్సరీలను సందర్శించి మొక్కలు నాటేందుకు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా మొక్కలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులు, ధరణీ పోర్టల్ నిర్వాహణ పరిశీలించారు. ధరణీలో అందిన ధరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి తహసీల్దార్ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని సూచించారు. తమ పరిధిలో లేని ధరఖాస్తులను ఆర్డీఓ, కలెక్టర్ కార్యాలయాలకు పంపించాలని తెలిపారు. వంద పడకల ఆస్పత్రిని సందర్శించి ఎస్ఎన్‌సీయూ, ఫార్మసీ వివిధ వార్డులు, పరిసరాలను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహణ కల్పించాలన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలోని కంది శ్రీనివాసరెడ్డి ప్రజాసేవా భవన్‌లో నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పాలన సాగిస్తోందన్నారు. ఇప్పటికే గ్యారంటీ హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొందన్నారు. ఆనాడు అసెంబ్లీ ఎన్నికల సమయంలో వరంగల్ రైతు డిక్లరేషన్ సభలో తమ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రకటించిన విధంగా ఇప్పుడు ఏకకాలంలో రైతు రుణమాఫీ చేస్తున్నట్టు రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం రైతులకు పెద్ద ఊరట కలిగించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైనథ్ జడ్పీటీసీ అరుంధతివెంకట్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్ రంజాని, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు గుడిపెల్లి నగేష్, మావల ఎంపీపీ దర్శనాల సంగీతపవన్, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస, ఆవుల వెంకన్న, సంద నర్సింగ్, రామేశ్వర్, జాఫర్ అహ్మద్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు చరణ్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, బాయిన్‌వార్ గంగారెడ్డి ఉన్నారు.

కిసాన్ కాంగ్రెస్ ధన్యవాదాలు

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన ఏకకాలంలో రైతులకు 2లక్షల రుణమాఫీపై యావత్ తెలంగాణ రైతాంగం, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు డిక్లరేషన్ భాగంగా రూ.2 లక్షల వరకు వ్యవసాయ రుణాలను మాఫీ చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించడం జరిగిందన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం ఏర్పాటైన 7నెలల్లోనే ఏకకాలంలో 31వేల కోట్లతో రుణమాఫీకి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు. పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం విడతల వారీగా రూ.28వేల కోట్ల వ్యవసాయ రుణాలను మాత్రమే మాఫీ చేసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు బూర్గుల మల్లేష్, ఉపాధ్యక్షులు తడిసెన వెంకట్‌రెడ్డి, మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, యువజన జిల్లా ఉపాధ్యక్షులు వేముల నాగరాజు, రాజేశ్వర్ యాదవ్ పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఆర్ఎం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌ను డివిజనల్ రైల్వే మేనేజర్ నీతి సర్కార్ శనివారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా రైల్వే స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే స్టేషన్‌లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఇటీవల జరిగిన రైల్వే ప్రమాదం నేపథ్యంలో డివిజనల్ స్టాఫ్‌తో సేఫ్టీ మీటింగ్ నిర్వహించారు. ఎలాంటి సమస్యలు ఉన్న అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

రైల్వే డీఆర్ఎంకు ఎమ్మెల్యే వినతి..

రైల్వే అండర్ బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని రైల్వే డీఆర్ఎం నీతి సర్కార్‌ను ఎమ్మెల్యే పాయల శంకర్ కోరారు. శనివారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆమెకు రైల్వే సమస్యలపై విన్నవించారు. తాంసి బస్టాండ్ వద్ద రైల్వే గేట్ వల్ల ప్రజల పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ ఆర్‌ఓబి పనులను త్వరగా చేపట్టాలని కోరారు. రైల్వే అండర్ బ్రిడ్జి మంజూరై కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రావాల్సిన నిధులు రాకపోవడంతో ఆలస్యం అవుతుందన్నారు. త్వరగా రైల్వే ఓవర్ బ్రిడ్జి, అండర్ బ్రిడ్జి పనులు ప్రారంభించి, ప్రజల అసౌకర్యాన్ని దూరం చేసే విధంగా చర్యలు చేపడతామన్నారు.

మండల పరిషత్ నిధులపై ఆడిటింగ్



నవతెలంగాణ - కాసిపేట

మండల పరిషత్ కార్యాలయంలో మండల పరిషత్ నిధులకు సంబంధించి ఆడిటింగ్ నిర్వహిస్తున్నారు. సీనియర్ ఆడిటర్ దాసరి వెంకటరమణ ఆధ్వర్యంలో 2023-2024 ఏడాదికి సంబంధించి బిల్లులు ఆడిటింగ్ చేపట్టారు. సీసీ రోడ్లు, ఆర్‌బ్ల్యూఎస్ తదితర నిధులు మొత్తానికి సంబంధించి బిల్లులపై సీనియర్ ఆడిటర్ పరిశీలిస్తూ లెక్కల తనిఖీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ తిరుపతి, టైపిస్ట్ స్వామి పాల్గొన్నారు.

అభయారణ్యం ఎంతో బాగుంది: ట్రైనీ ఐఎఎస్‌లు



నవతెలంగాణ-జన్నారం

అభయారణ్యం ఎంతో బాగుందని ట్రైనీ ఐఏఎస్‌లు అటవీ అందాలను తిలకించి మనోభావాలను వ్యక్తం చేశారు. కవ్వాల పులుల అభయారణ్యంలోని ఇందన్‌పల్లి, తాళ్లపేట, జన్నారం రేంజ్‌లలోని అటవీ అందాలను శనివారం శిక్షణ ఐఏఎస్ అధికారులు వీక్షించారు. 2023 బ్యాచ్‌కి చెందిన ట్రైనీ ఐఏఎస్‌లు ఉమాహారితి ఎన్, అజ్మీర సాంకేత్ కుమార్, గరిమ నరుల, అభిజ్ఞ మాల్వియ, అజయ్ యాదవ్, ఎం.శేస్త, ఐఈఎస్ఎస్ డి.మనోజ్ శిక్షణలో భాగంగా ఇక్కడికి వచ్చి సఫారిపై అభయారణ్యంలోని జన్నారం డివిజన్ అటవీ ప్రాంతంలోని గనిశెట్టికుంట, మైసమ్మకుంట, కామన్‌పల్లి వాచ్ టవర్లను, బైసన్ కుంట, మంచెలను, పచ్చి గడ్డి పెంపక కేంద్రాలను, వన్యప్రాణులను తిలకించారు. ఉదయం సఫారీలలో వెళ్లి రాత్రి మండల కేంద్రానికి తిరిగి వచ్చారు. ఈ సందర్భంగా పలువురు ఐఏఎస్‌లు మాట్లాడుతూ అడవి అందాలను మరువలేమన్నారు. అడవుల్లో పర్యటించినంత సేపు సమయం తెలియలేదని చెప్పారు. ఈ ప్రాంతానికి మళ్లీమళ్లీ రావాలనిపిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. వారి వెంట ఎండీ హఫీజోద్దీన్, సుష్మారావు, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ తిరుపతి, సెక్షన్, బిట్ ఆఫీసర్లు ఉన్నారు.

కారుణ్య నియామక పత్రాల అందజేత



నవతెలంగాణ-మందమర్రి

జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏరియా జనరల్ మేనేజర్ మనోహర్ 24 మందికి మెడికల్ ఇన్ వాలిడేషన్ డిపెండెంట్లకు కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఏరియాలో ఇప్పటి వరకు 1830 మందికి కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు ఇచ్చినట్లు జీఎం తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, ఏఐటీయూసీ బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రటరీ దాగం మల్లేష్, సీఎంఓఏఐ ప్రెసిడెంట్ పైడిశ్వర్, డివైపిఎం మైత్రేయ బంధు, డివైపిఎం సత్యబోస్, రాజలింగు, ఓఎస్ పాల్గొన్నారు.